తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

# జనంసాక్షి

www.janamsakshi.org

వరంగల్ - ఆదిలాబాద్

హన్మకొండ | జనగాం | ములుగు నిర్మల్ | మంచిర్యాల
ప్రొ॥ జయశంకర్ భూపాలపల్లి కొమురం భీం ఆసిఫాబాద్
మహబూబాబాద్

ఆదివారం
24 మే 2026

పేజీలు - 8




## వరిగడ్డి మంటలకు

# రైతు దంపతులు బలి

- చేనులోనే భర్త సజీవదహనం
- ఆసుపత్రిలో చికిత్స పొందుతూ భార్య మృతి
- రేపాకపల్లెలో అలుముకున్న విషాదం

**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో/రేగొండ, (జనంసాక్షి):** "పిల్లలందరినీ ఒక ఇంటివాళ్లను చేశా. ఇక నా బాధ్యత తీరిపోయింది" అని చెప్పుకునే వయసులో ఆ రైతుకు మృత్యువు పంట చేనులోనే ఎదురైంది. వరిగడ్డి తగలబెడితే భూమి పదునవుతుందని నమ్మి నిప్పు అంటించాడు. కానీ అదే మంటలు క్షణాల్లో అతని ప్రాణాలను చిదిమేశాయి. భర్తను కాపాడబోయి భార్య కూడా చికిత్స పొందుతూ కన్నుమూయడంతో జయశంకర్ భూపాలపల్లి జిల్లా రేగొండ మండలం రేపాకపల్లె గ్రామం శోకసంద్రంలో మునిగింది.

వార్త మెయిన్ 3లో

## పుష్కర శోభలో సంగమ క్షేత్రం..

# మురిసిన కాళేశ్వరం



**కాళేశ్వరం, మే 24 (జనంసాక్షి) :** సరస్వతి అంత్య పుష్కరాల సందర్భంగా జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాళేశ్వరం పుష్కర శోభను సంతరించుకుంది. శనివారం భక్తుల రద్దీ పెరగడంతో కాళేశ్వర క్షేత్రం మురిసింది. శ్రీ కాళేశ్వర ముక్తీశ్వర స్వామి వారి ఆలయాన్ని శనివారం నాసిక్‌కు చెందిన మహామండలేశ్వర ఆచార్య సంవిదానంద సరస్వతి మహారాజ్ దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం సరస్వతి నదిలో పుణ్యస్నానం ఆచరించిన అనంతరం ఆలయానికి చేరుకున్న మహారాజ్‌కు అర్చకులు వేద మంత్రోచ్ఛారణల మధ్య సంప్రదాయబద్ధంగా పూర్ణకుంభ స్వాగతం పలికారు. అనంతరం స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు నిర్వహించి ప్రత్యేక దర్శనం చేసుకున్నారు.

వార్త మెయిన్ 7లో

## దొంగతనం కేసులో పట్టుబడ్డ

# బంగారం ఏమైనట్టు!

- నిందితుడి వద్ద రికవరీ చేసిన 12 తులాల బంగారం...
- బాధితురాలికి అప్పగించని పోలీసులు...
- బాధితురాలు, నిందితుడి వద్ద బేర సారాల కింద ఆగిన రికవరీ బంగారం...
- పోలీస్ స్టేషన్ కు కూత వేటు దూరంలోని ఓ గ్రామంలో వెలుగులోకి వచ్చిన సంఘటన...
- చర్చనీయాంశంగా మారిన బంగారం కథ...



**చెన్నారావుపేట, మే 23 ( జనం సాక్షి):** దొంగతనం కేసులో పట్టుబడ్డ బంగారం ఏమైందని పలువురు చర్చించుకుంటున్నారు. నిందితుడి వద్ద చోరీకి గురైన 12 తులాల బంగారాన్ని పోలీసులు స్వాధీనం చేసుకొని కోర్టు ద్వారా బాధితురాలికి అప్పగించకుండా కాలయాపన చేస్తున్నారనే ఆరోపణలు బహటంగా వినిపిస్తున్నాయి. అటు నిందితుడి వద్ద ఇటు బాధితురాలి వద్ద భేరసారాల కింద డబ్బులను మాట్లాడుకుని అవి ముట్టకపోవడంతో ఇప్పటివరకు పోలీసులు కేసును నీరుగారుస్తూ పక్కదోవ పట్టించడానికి ప్రయత్నాలు చేస్తున్నట్లు చెన్నారావుపేట మండలంలో చర్చ జోరుగా కొనసాగుతోంది. చెన్నారావుపేట పోలీస్ స్టేషన్ కు కూత వేటు దూరంలో ఉన్న ఓ గ్రామంలో గత నెల ఏప్రిల్ లో ఓ వ్యక్తి నూతనంగా ఇంటి నిర్మాణం చేపట్టుకొని గృహప్రవేశం కార్యక్రమం నిర్వహిస్తాడు. ఈ గృహప్రవేశ కార్యక్రమానికి తన సొంత సోదరి కూడా వస్తుంది. తన సోదరి బ్యాగులో పెట్టుకున్న 12 తులాల బంగారం చోరీకి గురవుతుంది. దీంతో సోదరి తన సోదరుడు దొంగిలించాడని గ్రహించి చెన్నారావుపేట పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేస్తుంది. పోలీస్ స్టేషన్ లో కేసు నమోదు చేసుకున్న ఎస్సై విచారణ చేపట్టాడు. అనంతరం పెద్ద మనుషులు సోదరీ సోదరుడి మధ్య పంచాయతీ నిర్వహించి సోదరుడే బంగారాన్ని దొంగిలించాడని ఆ బంగారాన్ని తన సోదరికి అప్పగించాలని తీర్మానించారు. అనంతరం బంగారాన్ని నిందితుడు పెద్ద మనుషుల సమక్షంలో చెన్నారావుపేట పోలీస్ స్టేషన్ లో అప్పగించాడు. ఆ అప్పగించిన బంగారాన్ని చెన్నారావుపేట ఎస్సై కోర్టులో మిగతా 9లో..



## ఎల్లారెడ్డిపల్లిలో

# భారీ అగ్నిప్రమాదం

- మొక్కజొన్న పంట నష్టం
- మొట్లపల్లిలో ప్రారంభమైన అగ్ని ప్రమాదం..ఎల్లారెడ్డిపల్లికి వ్యాపించింది
- రోడ్లపై ఆరబోసిన మొక్కజొన్న పంటకు ప్రమాదవశాత్తు అంటుకున్న మంటలు
- సమయస్ఫూర్తితో వ్యవహరించిన పిడిసిల్ల, ఎల్లారెడ్డిపల్లి గ్రామాల సర్పంచులు

**మొగుళ్లపల్లి, మే 23 (జనంసాక్షి) :** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లి మండలంలోని ఎల్లారెడ్డిపల్లిలో భారీ అగ్నిప్రమాదం చోటు చేసుకోవడంతో.. తీవ్రమైన మొక్కజొన్న పంట నష్టం వాటిల్లింది.

వార్త మెయిన్ 7లో

## ఆర్థిక సాయం అందజేసిన 28వ వార్డ్ కౌన్సిలర్



**నర్సంపేట మే 23 (జనం సాక్షి)**ఎన్నికల సమయంలో "ఆపదలో ఉన్న ప్రతి కుటుంబానికి అండగా ఉంటాం" అని ఇచ్చిన మాటను 28వ వార్డు కౌన్సిలర్ జూలూరి రోజా రాణి . శనివారం తెలిపారు ఆమె మాట్లాడుతూ . వార్డు సభ్యులకు అందుబాటులో ఉంటూ. వారికి ఎలాంటి ఆపదొచ్చిన నేనున్నానని అండగా ఉంటున్నానని ఆమె పేర్కొన్నారు సంగెపు రాజేంద్రప్రసాద్ .దశదినకర్మ సందర్భంగా కుటుంబాన్ని పరామర్శించి, 10,000/- ఆర్థిక సహాయాన్ని. అందించినట్టు పేర్కొన్నారుఇది కేవలం సహాయం కాదు.ఆపదలో ఉన్న కుటుంబానికి భరోసా. అన్నారు.ఈ కార్యక్రమంలో వార్డ్ సభ్యులు తాబేటీ క్రాంతికుమార్, సంగెపు శ్రీను, మొగిలిచర్ల సందీప్, బిజెపి నియోజకవర్గ నాయకులు జూలూరి మనీష్ గౌడ్, కార్యదర్శి చిలువేరు అన్వేష్, వార్డ్ యువకులు సంగెపు తేజ, సాయి తరుణ్ కుటుంబ సభ్యులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## పాలీసెట్ పరీక్షలో స్టేట్ ర్యాంకు సాధించిన విజ్ డమ్ హై స్కూల్ విద్యార్థి



**నర్సంపేట మే 23 ( జనం సాక్షి)**నర్సంపేట పట్టణంలోని పాలీసెట్ 2026 ప్రవేశ పరీక్షల్లో విజ్ డమ్ హై స్కూల్ కు చెందిన షేక్ ఫర్మాన్ షా రాష్ట్రస్థాయిలో 4వ ర్యాంకును సాధించినట్లు పాఠశాల డైరెక్టర్ జావెద్ . తెలిపారు. ఈ విద్యార్థి 120 మార్కులకు గాను 119 మార్కులు సాధించడం జరిగింది. ఉత్తమ ప్రతిభను కనబరిచిన ఫర్మాన్ షా మాట్లాడుతూ.... కంప్యూటర్ ఇంజనీరింగ్ లో రాణించి భవిష్యత్తులో ఐఏఎస్ కావడం తన లక్ష్యమని తెలిపాడు. తన విజయానికి నిరంతరం కృషి చేసిన తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు, ప్రోత్సహించిన వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు. షేక్ అర్మాన్ షా స్టేట్ 48వ ర్యాంకు, గౌతమ్ స్టేట్ 350 వ ర్యాంకు సాధించగా, 2000 ర్యాంకు లోపు 12 మంది విద్యార్థులు సాధించినట్లు డైరెక్టర్ జావెద్ తెలిపారు. ఉత్తమ ప్రతిభను కనబరిచి రాష్ట్ర స్థాయిలో రాణించిన విద్యార్థులను పాఠశాల కరస్పాండెంట్ జహంగీర్, డైరెక్టర్ జావేద్, అకాడమిక్ అడ్వైజర్ నాజియ ఇక్బాల్, వైస్ ప్రిన్సిపాల్ ప్రకాష్, ప్రీ స్కూల్ ప్రిన్సిపాల్ ఫహీం సుల్తానా, హై స్కూల్ ఇన్చార్జి హారిక, వీరభద్రయ్య, రాము, ఇలియాస్, శివరాజ్, సతీష్ కుమార్, రఘుపతి రెడ్డి, బి రవీందర్, వెంకటేశ్వర్లు, నవీన్, ఎల్ రవీందర్ లతో పాటు ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.

## రైస్ మిల్లులను అకస్మితంగా తనిఖీ చేసిన ఎస్ఐ

### ధాన్యం అన్‌లోడింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలని మిల్లర్లకు ఆదేశం



**చిట్యాల, మే 23( జనం సాక్షి ):**రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ధాన్యం కొనుగోలు, అన్‌లోడింగ్ ప్రక్రియను సజావుగా సాగించేందుకు మిల్లర్లు సహకరించాలన్నారు. ఎస్సై పోచంపల్లి సతీష్ శనివారం మండలంలోని పలు రైస్ మిల్లులను ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా మిల్లుల వద్ద జరుగుతున్న ధాన్యం అన్‌లోడింగ్ పనులను, లారీల రాకపోకలను ఆయన స్వయంగా పరిశీలించారు.అనంతరం రైస్ మిల్లర్లు, హమాలీలు,అక్కడి కార్మికులతో ఎస్ఐ మాట్లాడారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ ధాన్యం లోడింగ్, అన్‌లోడింగ్ పనులలో ఆలస్యం కాకుండా ఉండేందుకు తక్షణమే అదనపు హమాలీలను ఏర్పాటు చేసుకోవాలి.మిల్లుల వద్ద ధాన్యం ట్రాక్టర్లు, లారీలు ఎక్కువ సమయం వేచి ఉండటం వల్ల రైతులపై అదనపు వాహన వెయిటింగ్ ఛార్జీల భారం పడుతోంది. కాబట్టి ఏ రోజు ధాన్యం ఆ రోజే త్వరితగతిన అన్‌లోడ్ అయ్యేలా చర్యలు తీసుకోవాలి అన్నారు. ప్రస్తుత ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకుని, ధాన్యంతో మిల్లుల వద్దకు వచ్చే రైతులు ఎండకు ఇబ్బంది పడకుండా ఉండేందుకు వీలుగా నీడ వసతి, చల్లని త్రాగునీటి సౌకర్యాన్ని తప్పనిసరిగా కల్పించాలి.రైతులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా మిల్లుల యాజమాన్యాలు పోలీస్ శాఖకు, ప్రభుత్వానికి సహకరించాలని, నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు ఉంటాయని ఎస్ఐ పోచంపల్లి సతీష్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, మిల్లు ప్రతినిధులు పాల్గొన్నారు.

# కాటారంలోనే పాలీసెట్ కౌన్సిలింగ్ సేవలు



**భూపాలపల్లి జిల్లా:మే 23 (జనం సాక్షి):** తెలంగాణ రాష్ట్రం లోని డిప్లమా ఇన్- ఇంజనీరింగ్, పాలిటె క్నిక్ పాలీసెట్ 2026 ఫలితాలు శనివారం ఉదయం 11:30 గంటలకు మాసాబ్ ట్యాంకులోని సాకేతిక విద్యమండలి కార్యాలయంలో ఈ ఫలితాలను టెక్నికల్ ఎడ్యుకేషన్ కమిషనర్ శ్రీ దేవసేన విడుదల చేశారు.విద్యార్థుల మార్కుల ఆధారంగా తెలంగాణ లోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీల్లో ఇంజనీరింగ్ నాన్ -ఇంజనీరింగ్ టెక్నా లజీ డిప్లొమా కోర్సుల్లో ప్రవేశాలు కల్పించబడ తాయి,ఈ నేపథ్యం లోనే విద్యార్థుల సౌకర్యార్థం భూపాల పల్లి జిల్లా కాటారం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో పాలీసెట్ హెల్ప్‌లైన్ సెంటర్‌ను ఏర్పాటు చేసినట్లు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ డా. రాజ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు.ఈ మేరకు ఆయన తెలిపిన వివరాల ప్రకారం పాలీసెట్ పరీక్ష రాసి పాలిటెక్నిక్ సీటు పొందే విద్యార్థు లు ఇకపై దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా కాటారంలోనే ధృవపత్రాల పరిశీలన, కౌన్సిలింగ్ ప్రక్రియ, వెబ్ ఆప్షన్ల నమోదు వంటి సేవలను పొందవచ్చన్నారు.ఇప్పటి వరకు విద్యా ర్థులు వరంగల్, భూపాలపల్లి, కరీంనగర్,వంటి దూర ప్రాంతాలకు వెళ్లి కౌన్సి లింగ్ ప్రక్రియ పూర్తి చేసుకోవాల్సి వచ్చే దని, దీనివల్ల సమయం మరియు వ్యయభారం పెరుగు తుండేదన్నారువిద్యార్థులు, తల్లిదండ్రుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం ఈ సహాయక కేంద్రాన్ని కాటారం లో ఏర్పాటు చేసిందని తెలిపారు .పాలీసెట్ తొలి విడత కౌన్సిలింగ్‌లో భాగంగా ధృవపత్రాల పరిశీలన ఈ నెల 29-05-2026 నుండి 01-06-2026 వరకు నిర్వహించను న్నట్లు వెల్లడించారు. అర్హత కలిగిన విద్యా ర్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకొని సమయానికి కౌన్సి లింగ్ ప్రక్రియ పూర్తి చేసుకోవాలని ప్రిన్సిపాల్ కోరారు.

# నేడే యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్ ప్రిలిమినరీ పరీక్ష

- జిల్లావ్యాప్తంగా పకడ్బందీ ఏర్పాట్లు పూర్తి
- జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి



**హనుమకొండ, ప్రతినిధి మే 23, (జనం సాక్షి)** :యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్ ప్రిలిమినరీ పరీక్ష--2026 నిర్వహణకు జిల్లావ్యాప్తంగా అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా పూర్తి చేసినట్లు హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి తెలిపారు.శనివారం హనుమకొండ సుబేదారిలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో ఏర్పాటు చేసిన రెండు పరీక్షా కేంద్రాలను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. పరీక్షా కేంద్రంలోని ప్రతి గదిలో సదుపాయాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. పరీక్ష నిర్వహణకు సంబంధించిన మెటీరియల్‌ను పరిశీలించడంతో పాటు తాగునీరు, ఫ్యాన్లు, విద్యుత్ దీపాలు, మరుగుదొడ్లు తదితర సౌకర్యాలను తనిఖీ చేశారు. హాల్ టికెట్ నెంబరింగ్, ఇన్విజిలేటర్లు, రూట్ అధికారులు మరియు ఇతర సిబ్బంది విధులపై సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్ ప్రిలిమినరీ పరీక్ష ఆదివారం (24-05-2026) రెండు సెషన్లలో నిర్వహించబ డుతుందని తెలిపారు. ఉదయం 9:30 గంటల నుండి 11:30 గంటల వరకు మొదటి సెషన్, మధ్యాహ్నం 2:30 గంటల నుండి 4:30 గంటల వరకు రెండో సెషన్ జరుగుతుందని పేర్కొన్నారు. జిల్లాలో మొత్తం 10 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జిల్లావ్యాప్తంగా 4,075 మంది అభ్యర్థులు పరీక్ష రాయనున్నారని వెల్లడించారు.పరీక్ష ప్రారంభానికి 30 నిమిషాల ముందే పరీక్షా కేంద్రాల ప్రధాన గేట్లు మూసివేయబడతాయని, ఒక్క నిమిషం ఆలస్యమైనా అభ్యర్థులకు అనుమతి ఉండదని స్పష్టం చేశారు. జిల్లాలోని హనుమకొండ సుబేదారిలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల, ఫాతిమా నగర్‌లోని సెయింట్ గాబ్రియల్ హై స్కూల్, హంటర్ రోడ్డులోని న్యూ సైన్స్ డిగ్రీ కాలేజ్, అడ్వకేట్స్ కాలనీలోని ఎస్సార్ నేషనల్ హై స్కూల్, వడ్డేపల్లిలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల, ములుగు రోడ్డులోని శ్రీ గాయత్రి డిగ్రీ అండ్ పీజీ కళాశాల, భద్రకాళి దేవాలయం సమీపంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, లాల్ బహుదూర్ కళాశాల మరియు అశోక జంక్షన్ సమీపంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పరీక్ష నిర్వహించబడుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో యూపీఎస్సీ సెంట్రల్ ఇన్‌స్పెక్షన్ అధికారి శుభం గాద్, ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ సుంకరి జ్యోతి, వైస్ ప్రిన్సిపల్ ఎస్.ఎం. రెహమాన్, హనుమకొండ తహసీల్దార్ రవీందర్ రెడ్డి, రూట్ అధికారి భావ్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

## పెట్రోల్ బంక్ యజమానిపై చర్యలు తీసుకోవాలి

### మారేపల్లి మల్లేష్




**చిట్యాల, మే 23( జనం సాక్షి)** : మండల కేంద్రంలోని ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంక్ లో విని యోగదారులకు అవసరమైన తాగునీరు, టాయిలెట్, గాలి, ఫస్ట్ ఎయిడ్ కిట్ కనీస సౌకర్యాలు కల్పించడం లేదని మారపల్లి మల్లేష్ అన్నారు.ఈ సందర్భంగామల్లేష్ మాట్లాడుతూ మండల కేంద్రంలోని ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంకులో వినియోగదారులకు ఎటువంటి సౌకర్యాలు కల్పించడం లేదని ఆరోపించారు. పెట్రోల్ పోసుకోవడానికి వచ్చిన వాహనదారుల టైర్లలో గాలి నింపే యంత్రం ఉన్నా కూడా అది పనిచేయడం లేదని,వేసవికాలం కాబట్టి ఎండ వేడి మికి వాహన టైర్లల్లో గాలి తగ్గే అవకాశం ఉన్నందున గాలిపెట్టే యంత్రం పనిచేయక పోవడంతో వాహనదారుల పరిస్థితి ఏమిటని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. శుభ్రమైన తాగునీరు టాయిలెట్ సౌకర్యం కల్పించడంలో యాజమాన్యం పూర్తిగా విఫలమైందని, ముఖ్యంగా మహిళలు చిన్నపిల్లలకు టాయిలెట్ వాడే సౌకర్యం బంకులో లేదని అన్నారు.పై సౌకర్యాలు అన్నిమానవత దృక్పథంతో కాక చట్టబద్ధమైన నిబంధనలు అన వినియోగదారులు తమ ఫోన్ పనిచేయని సమక్షంలో బంకు నుండి ఎమర్జెన్సీ కాల్ చేసుకునే హక్కు కూడా ఉంటుందని అన్నారు. పై సౌకర్యాలు పౌరులకు వినియోగదారులకు కల్పించడంలో పూర్తిగా విఫలం అయినందున బంకు యజమానిపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## పాలిసెట్‌లో సత్తా చాటిన నిర్మల్ విద్యార్థిని



**నిర్మల్ , మే 23 (జనంసాక్షి )** పాలిటెక్నిక్ ఎంట్రన్స్ టెస్ట్ పాలిసెట్-2026 ఫలితాల్లో నిర్మల్ పట్టణం శ్రీనగర్ కాలనీకి చెందిన పెంటు మహతి రాష్ట్రస్థాయిలో 72వ ర్యాంకు సాధించి జిల్లాకు గర్వకారణంగా నిలిచింది. పెంటు సాయిప్రసాద్-సంధ్య దంపతుల కుమార్తె అయిన మహిత ఉన్నత ర్యాంకు సాధించడంపై తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు. కాలనీవాసులు మహితను అభినందించారు

# పుష్కరాలకు క్రమంగా పెరుగుతున్న భక్తులు



కాళేశ్వరం , మే 24 , ( జనం సాక్షి)సరస్వతి అంత్య పుష్కరాల సందర్భంగా మూడవ రోజు కాళేశ్వరం త్రివేణి సంగమంలో భక్తుల రద్దీ క్రమంగా పెరుగుతోంది. మండుతున్న ఎండను సైతం లెక్కచేయకుండా భక్తులు భారీ సంఖ్యలో తరలి వచ్చి పుణ్యస్నానాలు ఆచరిస్తూ స్వామివారిని దర్శించుకుంటున్నారు. ఆర్టీసీ బస్సుల్లో వచ్చే భక్తుల సౌకర్యార్థం బస్టాండ్ నుండి పుష్కర ఘాట్ వరకు ఉచిత షటిల్ సర్వీసులు ఏర్పాటు చేయడంతో భక్తులు సులభంగా ఘాట్లకు చేరుకుంటున్నారు. త్రివేణి సంగమంలో పుణ్యస్నానాలు ఆచరించిన అనంతరం భక్తులు కాళేశ్వరం ప్రధాన ఆలయాన్ని సందర్శించి శ్రీ కాళేశ్వర ముక్తేశ్వర స్వామివారికి అభిషేకాలు నిర్వహిస్తున్నారు. అలాగే శుభానంద దేవి, సరస్వతి మాతలను దర్శించుకుంటున్నారు.ప్రతిరోజూ నిర్వహిస్తున్న స్వామివారి కల్యాణం, ప్రత్యేక హోమాలలో భక్తులు ఉత్సాహంగా పాల్గొంటున్నారు. సరస్వతి ఘాట్ వద్ద సాయంత్రం నిర్వహించే సరస్వతి నవరత్న మాలా హారతి ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. హారతి అనంతరం సాంస్కృతిక కళా ప్రదర్శనలు, పండితుల ప్రవచనాలు భక్తులను ఆకట్టుకుంటున్నాయి.వివిధ ప్రాంతాల నుండి స్వామీజీలు విచ్చేసి ప్రవచనాలు అందించడంతో భక్తుల రాక మరింతగా పెరుగుతోంది. ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకుని మంచినీటి సరఫరా, చలువ పందిళ్లు, మిస్ట్ ఫాగ్ స్ప్రింక్లర్ల ద్వారా నీటి జల్లులు పడేలా ప్రత్యేక ఏర్పాట్లు చేయడం ద్వారా భక్తులు సేదతీరుతున్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని శాఖల సమన్వయంతో యంత్రాంగం విస్తృత ఏర్పాట్లు చేసి పుష్కరాలను విజయవంతంగా నిర్వహిస్తోంది.

# వామ్మో ఎండలు



మల్హర్, మే 23(జనంసాక్షి)పెరుగుతున్న ఎండ తీవ్రత దృష్ట్యా ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. ఉదయం 10 గంటల నుండే ఉష్ణోగ్రతలు పెరిగడం వలన వడదెబ్బ తగలకుండా ప్రజలు జాగ్రత్తగా ఉండాలి, తప్పని పరిస్థితుల్లో బయటకు వెళ్లవలసి వస్తే తలపై టోపీ ధరించి వెళ్లాలి, సరిపోయినంతగా తాగునీరు, ద్రవప దార్థలు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, నిమ్మరసం, మజ్జిగా, పండ్ల రసాలు వంటివి తీసుకుంటూ ఉండాలి. సన్నని వదులుగా ఉండే లేత రంగు కాటన్ దుస్తులు వాడటం, ధరించడం చేయాలి. ఎండలు అధికంగా ఉన్న సమయంలో వీలైనంత వరకు ఇంట్లోనే ఉండాలి ఉదయం, సాయంత్రం సమయంలోనే బయటకు వెళ్లాలని సూచన. చిన్నపిల్లలు, గర్భిణులు, వయోవృద్ధులు వడదెబ్బకు గురయ్యే అవకాశం ఉందని వారు జాగ్రత్తగా ఉండాలి అని ప్రభుత్వం, వైద్యులు ప్రజలకు తగిన సూచనలు చేస్తుంది అని మండల తహసీల్దార్ కె. రవికుమార్ మండల ప్రజలను అప్రమత్తం చేస్తూ ఆరోగ్య రక్షణ చర్యలు సూచించారు.

# కేంద్ర ప్రభుత్వం నిధులు విడుదల చేయడం పట్ల బిజెపి నేతల హర్షం

- హనుమకొండ బిజెపి ఆధ్వర్యంలో ప్రధాని మోదీ చిత్రపటానికి పాలాభిషేకం



హనుమకొండ ప్రతినిధి మే 23 (జనం సాక్షి) : హనుమకొండ నగరంలోని అదాలత్ జంక్షన్‌లో బీజేపీ హనుమకొండ జిల్లా అధ్యక్షులు కొలను సంతోష్ రెడ్డి నాయకత్వంలో భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. తెలంగాణ రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం అర్బన్ చాలెంజ్ ఫండ్ కింద రూ. 5681 కోట్లకు తుది ఆమోదం తెలపడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ముఖ్యంగా వరంగల్ అండర్‌గ్రౌండ్ సీవరేజ్ ప్రాజెక్ట్‌కు రూ. 4674 కోట్లు. 1168 కోట్లు కేంద్ర ప్రభుత్వం, రూ. 2337 కోట్ల మంజూరు చేయడం, అలాగే ఖమ్మం–వరంగల్ కరీంనగర్ క్లస్టర్‌కు ఐసిసి సి ప్రాజెక్ట్ మంజూరు కావడం పట్ల బీజేపీ నేతలు హర్షం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు కొలను సంతోష్ రెడ్డి మాట్లాడుతూ.తెలంగాణ రాష్ట్రానికి, ముఖ్యంగా వరంగల్ ప్రజలకు ప్రధాని శ్రీ నరేంద్ర మోదీ గారి కానుక ఇది. బీజేపీ ప్రభుత్వం ఎప్పుడూ అభివృద్ధికే ప్రాధాన్యత ఇస్తుంది. ప్రతి వర్షాకాలంలో హనుమకొండ, వరంగల్ ప్రాంతాలు వరదలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. ఈ అండర్‌గ్రౌండ్ సీవరేజ్ ప్రాజెక్ట్ ప్రజలకు ఎంతో మేలు చేస్తుంది. ఇందుకు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ గారికి, కేంద్ర గృహనిర్మాణ మరియు పట్టణాభివృద్ధి శాఖ మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్ కి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నాను'' అని అన్నారు.ఈ కార్యక్రమంలో పరకాల కంటెస్టెంట్ ఎమ్మెల్యే డా. కాళీ ప్రసాద్ , రాష్ట్ర ఓబీసీ మోర్చా ఉపాధ్యక్షులు కందగట్ల సత్యనారాయణ , మాజీ జిల్లా అధ్యక్షులు దొంతి దేవేందర్ రెడ్డి , మాజీ కార్పొరేటర్లు గుజ్జుల వసంత మహేందర్ రెడ్డి , రావుల కోమల కిషన్ , ప్రధాన కార్యదర్శి డా. సంద్ర మధు , ఉపాధ్యక్షులు బైరి శ్రావణ్ , రాధారపు శివకుమార్ , నర్మేట శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు

# అగ్ని ప్రమాదంలో పంట నష్టపోయిన రైతు కుటుంబానికి పరామర్శ



చెన్నారావుపేట, మే 23 ( జనం సాక్షి): చెన్నారావుపేట గ్రామ శివారులో అగ్నిప్రమాదానికి గురై వరి పంట పూర్తిగా నష్టపోయిన రైతు జినికిరి భాగ్యమ్మ కుటుంబాన్ని చెన్నారావుపేట గ్రామ సర్పంచ్ కంది శ్వేత కృష్ణ చైతన్య, వ్యవసాయ అధికారి గోపాల్ రెడ్డి, ఏఈఓ తిరుపతిలు పరామర్శించారు.ఈ సందర్భంగా ఘటనపై పూర్తి వివరాలు తెలుసుకొని పంట నష్టాన్ని పరిశీలించారు. రైతు కుటుంబానికి ధైర్యం చెబుతూ, సంబంధిత శాఖల ద్వారా అందుబాటులో ఉన్న సహాయం అందేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అలాగే రైతులు ఇలాంటి సందర్భాల్లో అప్రమత్తంగా ఉండాలని సూచించారు.పంట నష్టంపై అధికారులు నివేదిక సిద్ధం చేసి, రైతుకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ తిరుపతి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# సాంబయ్యకు అశ్రునివాళి.. అంత్యక్రియల్లో జర్నలిస్టుల సంఘీభావం



జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):హన్మకొండ జిల్లా హసన్ పర్తిలో శనివారం జరిగిన పావుశెట్టి సాంబయ్య అంత్యక్రియలకు జయశంకర్ భూపాలపల్లి జిల్లాకు చెందిన పలువురు జర్నలిస్టులు, ప్రముఖులు హాజరయ్యారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఆంధ్రప్రభ స్టాఫ్ రిపోర్టర్, టీఎస్‌జేయూ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ పావుశెట్టి శ్రీనివాస్ పితృవియోగం చెందారు. ఆయన తండ్రి పావుశెట్టి సాంబయ్య అనారోగ్యంతో బాధపడుతూ శుక్రవారం రాత్రి మృతి చెందగా, స్వగ్రామమైన హసన్ పర్తిలో శనివారం అంత్యక్రియలు నిర్వహించారు. తండ్రి మృతితో దుఃఖసాగరంలో ఉన్న జర్నలిస్టు మిత్రుడు పావుశెట్టి శ్రీనివాస్‌ను తెలంగాణ స్టేట్ జర్నలిస్ట్ యూనియన్ (టీఎస్‌జేయూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తోకల అనిల్ కుమార్, స్టేట్ జాయింట్ సెక్రటరీ తడుక సుధాకర్ గౌడ్, జయశంకర్ భూపాలపల్లి జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎడ్ల సంతోష్, దొమ్మటి రవీందర్, జిల్లా ఉపాధ్యక్షుడు గట్టు రవీందర్ తదితరులు పరామర్శించి ప్రగాఢ సంతాపం తెలిపారు. అనంతరం పావుశెట్టి సాంబయ్య అంత్యక్రియల్లో పాల్గొని ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ మోటపోతుల శివశంకర్ గౌడ్, చందర్ గౌడ్, జర్నలిస్టులు నాగపూరి శ్రీనివాస్, పసునూటి రవి, దూలం కుమార్, విష్ణు వర్ధన్, రౌతు కిషోర్, బుర్ర చక్రపాణి, ఓం నారాయణ, యాంసాని రాజు, రమేష్, డాక్టర్ సంపత్, అర్చకులు నరేష్, నారాయణ, ఉపసర్పంచ్ సలువాది సురేష్, ఆదెపు రవి తదితరులు పాల్గొన్నారు.

# అంత్య పుష్కరాలలో భానుడి ప్రతాపం తగ్గిన జన సందడి



కాళేశ్వరం , మే 23 , (జనం సాక్షి) జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాళేశ్వరంలో జరుగుతున్న సరస్వతి అంత్య పుష్కరాలకు ప్రభుత్వం భారీ ఏర్పాట్లు చేసింది. ప్రభుత్వం అనుకున్న జన ప్రవాహానికి వస్తున్న భక్తుల రద్దీకి చాలా తేడా ఉంది. భానుడి ప్రభావం కొట్టొచ్చినట్లు కనబడుతుంది. ప్రభుత్వం పుష్కరాలను భారీగా సక్సెస్ చేయాలనే ఉద్దేశంతో ప్రచార కార్యక్రమాలు పూర్తి చేసినప్పటికీ భక్తులు రాక పుష్కర ఘాట్లు ఖాళీగా దర్శనమిస్తున్నాయి. గుడిలో కూడా ఉచిత దర్శనం ద్వారా భక్తులు త్వరగా దర్శనాలు చేసుకుంటున్నారు. ఎండ వేడి తగ్గి మబ్బులు ఆవరించినట్లయితే భక్తులు పెరిగే అవకాశం ఉంది. వడదెబ్బల కారణంగా భక్తులు పుణ్యస్నానాలు ఆచరించడానికి భయపడుతున్నారు. ఏది ఏమైనా మబ్బులు ఏర్పడి ఎండ వేడిమి తగ్గితే భక్తులు పెరుగుతారని అధికారులు అంచనా వేస్తున్నారు.

# ప్రజా ప్రణాళికలో భాగంగా క్రీడాకారులకు బహుమతులు

## కలెక్టర్ చేతుల మీదుగా నియామక పత్రాల జారీ



జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 99 రోజుల ప్రజా ప్రణాళికలో భాగంగా జిల్లా క్రీడా శాఖ అధికారి చిర్ర రఘు ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలు నిర్వహించారు. ఈ నెల 21న నిర్వహించిన క్రీడా పోటీల్లో గెలుపొందిన 45 మంది విద్యార్థిని విద్యార్థులకు శనివారం జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ చేతుల మీదుగా బహుమతులు ప్రదానం చేశారు.అదేవిధంగా ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయిలో నిర్వహించిన జాబ్ మేళాలో ఉత్తమ ప్రదర్శన కనబరిచిన నిరుద్యోగులకు పలు కంపెనీల నుండి ఉద్యోగ నియామక పత్రాలను అందజేశారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా నుండి ఎంపికైన 43 మందికి నియామక పత్రాలు అందజేయడం జరిగింది. జిల్లా టూరిజం శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన క్లీన్ డే ప్రోగ్రాంలో భాగంగా కోటగుళ్ల పరిసరాలను క్రీడాకారులు శుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్కియాలజీ డైరెక్టర్ బుజ్జి, సెక్యూరిటీ రాజు, సీనియర్ బాల్ బ్యాడ్మింటన్ క్రీడాకారుడు రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

# బాధిత కుటుంబాలకు బీఆర్ఎస్ నేతల పరామర్శ

కుబీర్, మే 23, (జనంసాక్షి): కుబీర్ మండలంలోని పల్సి, చొండీ గ్రామాల్లో ఇటీవల మరణించిన పలువురి కుటుంబ సభ్యులను బీఆర్ఎస్ ముధోల్ తాలూకా సమన్వయ సమితి సభ్యులు డాక్టర్ కిరణ్ కొమ్రెవార్ శనివారం పరామర్శించారు. పల్సి గ్రామానికి చెందిన గజ్జరం, పురం శెట్టి గణేష్, చొండీ గ్రామానికి చెందిన దాసరి వెంకటేష్ ఇటీవల పలు కారణాలతో మరణించారు. ఈ విషయం తెలుసుకున్న డాక్టర్ కిరణ్ కొమ్రెవార్ వారి నివాసాలకు వెళ్లి, మృతుల చిత్రపటాలకు నివాళులర్పించారు. అనంతరం శోకతప్త హృదయంతో ఉన్న వారి కుటుంబ సభ్యులను కలిసి ఓదార్చారు. ఈ కష్టకాలంలో తాము అండగా ఉంటామని వారికి భరోసా కల్పించారు. ఈ పరామర్శలో ఎన్నిల అనిల్, గంధం పోశెట్టి, బాబు, దేవిదాస్, సంతోష్, పోతన్న, మెంచు రాములు, భోజరామ్ పటేల్, కైపాల్ రాములు, శేఖర్, ఇతర బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

## సిర్పూర్ (టి) బస్టాండ్ సమస్యపై స్పందించిన ఆర్టీసీ డిఎం రాజశేఖర్

- క్షేత్రస్థాయిలో పరిశీలన భూ వివాదంతో నిలిచిన పనులు



**కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి, మే 23(జనంసాక్షి ):**సిర్పూర్ (టి) మండల కేంద్రంలో సంవత్సరాలుగా కొనసాగుతున్న బస్టాండ్ సమస్యపై ఆర్టీసీ జిల్లా మేనేజర్ (డిఎం) రాజశేఖర్ శనివారం స్పందించి క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టారు. స్థానిక ఉప సర్పంచ్ ప్రశాంత్, సర్పంచ్ భర్త ఒడ్డెటి నాన్నయ్య పోలీస్ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శితో వార్డు సభ్యులు సాయి,నాయకులు మోహన్ శివ తో కలిసి ప్రస్తుత తాత్కాలిక బస్టాండ్ ప్రాంతాన్ని సందర్శించి అక్కడి పరిస్థితులను పరిశీలించారు. బస్సులు నిలవడానికి ఇబ్బందిగా మారిన పిచ్చి మొక్కలు, పొదలను సిబ్బందితో వెంటనే తొలగింపజేశారు. ప్రయాణికులకు ఇబ్బందులు కలగకుండా తాత్కాలికంగా అవసరమైన ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. అయితే పనులు కొనసాగుతున్న సమయంలో స్థానికంగా నివాసముంటున్న గద్దల ప్రవీణ్ అక్కడికి చేరుకుని సదరు స్థలం గద్దల సుజాత పై తమ పట్టా భూమి అని అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా డిఎం రాజశేఖర్, స్థానిక నాయకుడు ఒడ్డెటి నన్నయ్య, పోలీసులు, పంచాయతీ అధికారులు స్పందిస్తూ ఈ భూ సమస్యపై బస్టాండ్ కోసం కేటాయించిందని వివరించారు. అయినప్పటికీ భూ యజమానులు వినిపించుకోకపోవడంతో అక్కడ కొంత ఉద్రిక్తత నెలకొంది. దీనిపై సమగ్ర నివేదికను పైఅధికారులకు పంపిస్తున్నట్లు డిఎం రాజశేఖర్ తెలిపారు. భూ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించి ప్రజలకు త్వరలోనే పూర్తి స్థాయి బస్టాండ్ సౌకర్యం కల్పించేలా చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు.

## ధాన్యం నిల్వ ప్రక్రియ పకడ్బందీగా చేపట్టాలి

### జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**బెల్లంపల్లి, మే 23, (జనంసాక్షి)**కొనుగోలు కేంద్రాల ద్వారా కొనుగోలు చేసిన ధాన్యం తరలింపు, నిల్వ ప్రక్రియ పకడ్బందీగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శనివారం జిల్లాలోని బెల్లంపల్లి మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ గోదామును బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్, తహసిల్దార్ కృష్ణతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రైతు సంక్షేమంలో భాగంగా ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి మద్దతు ధర చెల్లించి రైతుల వద్ద నుండి నిబంధనల ప్రకారం నాణ్యమైన ధాన్యం కొనుగోలు చేస్తుందని తెలిపారు. కొనుగోలు చేసిన ధాన్యం దెబ్బతినకుండా కేటా యించిన ప్రకారం గోదాములు, రైస్ మిల్లులకు తరలిస్తున్నామన్నారు. ఈ క్రమంలో గోదా ములకు వచ్చే ధాన్యాన్ని త్వరగా దిగుమతి చేసుకొని నిబంధనల ప్రకారం నిల్వ చేయాలని తెలిపారు. రైస్ మిల్లర్లు తమకు నిర్దేశించిన లక్ష్యాలను సకాలంలో పూర్తిచేసే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం బెల్లంపల్లి మండల కేంద్రంలోని సింగరేణి క్లబ్, బూదకలాన్ గ్రామంలోని సింగరేణి క్లబ్ ను సందర్శించి ధాన్యం నిల్వకు గల అవకాశాలను పరిశీలించారు. సింగరేణి క్లబ్ లో ధాన్యం నిల్వ చేసేందుకు అవసరమైన అనుమతులు పొందాలని అధికారులకు సూచించారు. ఆర్ అండ్ ఆర్ కాలనీలోని కమ్యూనిటీ హాల్ ను కాసిపేట మండల తహసిల్దార్ సునీల్ దేశ్ పాండే తో కలిసి పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## కెఎస్ జేఏసీ మండల కన్వీనర్‌గా ముక్కెర వెంకటస్వామి ఎన్నిక



**మహాముత్తారం మే 23 (జనం సాక్షి)**కుల సంఘాల జేఏసీ మహాముత్తారం మండల శాఖ కన్వీనర్ గా ముక్కెర వెంకటస్వామి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శనివారం మండల కేంద్రంలో సమావేశం ఏర్పాటు చేసుకొని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కో కన్వీనర్ గా లింగమల్ల సడవల్లి రావు, కోఆర్డినేటర్లుగా పోడెం దామోదర్,పంగ సురేందర్, పంగ సంపత్, బోడ బాలాజీ, పుట్టల మల్లయ్య, మూడెత్తుల రవి, తైనేని సంపత్, ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

## ఇండ్ల గణనను పకడ్బందీగా నిర్వహించాలి

### జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):**జనగణన సర్వేలో భాగంగా జరుగుతున్న ఇండ్ల గణనను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు.శనివారం జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ఐడిఓసీ కార్యాలయం నుండి ఆర్డీఓలు, తహసిల్దార్లు, ఎంపీడీవోలతో జనగణన, బల్క్ ల్యాండ్ ఇష్యూస్, సాదా బైనామా, భూభారతి, ధాన్యం కొనుగోలు తదితర అంశాలపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ ఒకే చోట ఉండి సర్వే చేయడం కాకుండా కచ్చిత సమాచారం సేకరణకు ప్రతి ఇల్లు క్షుణ్ణంగా సర్వే చేయాలని ఆదేశించారు. 33 కాలాలతో కూడిన సర్వేలో కొన్ని చోట్ల తప్పులు దొర్లితే ఎన్యూమరేటర్లు, సూపర్ వైజర్లు లాగిన్ ఓపెన్ చేసి డాటా ను ఫోటోలు తీసుకుని తిరిగి తప్పులు లేకుండా ఎంట్రీ చేయాలని తెలిపారు. జిల్లాలో బల్క్ ల్యాండ్ సమస్యలను వెంటనే పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి జిల్లాల పర్యటన సందర్భంగా పరిష్కరించిన భూములకు అర్హులైన లబ్ధిదారులకు పట్టాలు అందచేస్తారని తెలిపారు. సాదా బైనమా, భూభారతి దరఖాస్తులను త్వరితగతిన పూర్తి చేసి ఆన్లైన్ లో నమోదులు చేయాలని సూచించారు. ధాన్యం కొనుగోళ్లపై తహసి ల్దార్లు దృష్టి సారించాలని కొనుగోలు కేంద్రాలను పరిశీలించి ధాన్యాన్ని వెంట వెంటనే మిల్లులకు తరలించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద లారీల కొరత లేకు ండా తహసిల్దార్లు పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, భూపాలపల్లి, కాటారం ఆర్డిఓ లు, అన్ని మండలాల తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

## నర్సంపేటలో మహిళా కారాగరంలో హెల్ప్ డెస్క్ ప్రారంభించిన

### వరంగల్ జిల్లా న్యాయ సైనాధికార సంస్థ కార్యదర్శి ప్రదీప్



**నర్సంపేట మే 23 ( జనం సాక్షి)**నర్సంపేట పట్టణంలోని లోని ప్రత్యేక మహిళా కారాగారంలో 'లీగల్ ఎయిడ్ హెల్ప్ డెస్క్' ప్రారంభించిన వరంగల్ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఏ.ప్రదీప్ .ఈ కేంద్రం ప్రారంభోత్సవం సందర్భంగా న్యాయమూర్తి ఏ.ప్రదీప్ మాట్లాడుతూ ఈ హెల్ప్ డెస్క్ ఖైదీలకు చట్టపరమైన సహాయాన్ని మరింత వేగంగా మరియు సులభంగా అందించే లక్ష్యంతో రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాలను అనుసరించి కారాగారంలో లీగల్ ఎయిడ్ హెల్ప్ డెస్క్ ను ప్రారంభిస్తున్నట్లు తెలిపారు.ములాఖత్ ప్రక్రియ సరళీకరణ జైలుకు వచ్చే ఖైదీల కుటుంబ సభ్యులు, బంధువుల "ములాఖత్" ప్రక్రియను సులభతరం చేయడం ఈ డెస్క్ ప్రాథమిక విధిగా తెలిపారు. ముఖ్యంగా మహిళా సంరక్షకులు, వృద్ధ తల్లిదండ్రులు, వికలాంగులు మరియు ఆర్థికంగా వెనుకబడిన వారు, తరచుగా కనీస న్యాయ పరిజ్ఞానం లేకుండా మరియు సందర్శకుల వైపు నుండి ఎటువంటి వ్యవస్థీకృత మద్దతు లేకుండా వస్తారు.ములాఖత్ కోసం వచ్చే సాధారణ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, నిబంధనలపై ఇక్కడ అవగాహన కల్పిస్తారు. ఖైదీలను కలవడానికి వచ్చే వారికి అవసరమైన చట్టపరమైన సహాయం మరియు మార్గదర్శకత్వం ఇక్కడ లభిస్తుంది అని తెలిపారు. ఈ హెల్ప్ డెస్క్ ద్వారా అర్హులైన ప్రతి ఖైదీకి ఉచితంగా లీగల్ అడ్వైజ్ (న్యాయ సలహాలు) అందించడం జరుగుతుంది అని సూచించారు. ప్రైవేట్ న్యాయవాదులను పెట్టుకోలేని వారి కోసం ప్రభుత్వ ఖర్చులతో ప్యానెల్ లాయర్లను కేటాయించే బాధ్యతను ఈ డెస్క్ తీసుకుంటుంది అని వివరించారు. ఖైదీల కుటుంబాలు బెయిల్ ఏర్పాటు చేయడం, పత్రాలను భద్రపరచడం, కోర్టులకు హాజరు కావడం, మరియు కేసులను అనుసరించడం వంటి విషయాలపై అవగాహన కల్పిస్తారు అని తెలిపారు. బెయిల్ మరియు కేసుల అప్‌డేట్స్, కేసుల ప్రస్తుత స్థితి, బెయిల్ పిటిషన్ల దాఖలు, మరియు కోర్టు ఆదేశాల గురించిన సమాచారాన్ని ఇక్కడి లీగల్ ఎయిడ్ వాలంటీర్లు మీకు అందిస్తారు. చట్టం ముందు అందరూ సమానులే. జైలులో ఉన్నంత మాత్రాన మీ ప్రాథమిక హక్కులు కోల్పోయినట్లు కాదు. ఈ హెల్ప్ డెస్క్‌ను ఒక గొప్ప అవకాశంగా భావించి, మీ సమస్యల పరిష్కారానికి దీనిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఈ సందర్భంగా న్యాయమూర్తులు మహిళా ఖైదీలతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.ఈ కార్యక్రమంలో నర్సంపేట న్యాయమూర్తులు యం.డి.యూసుఫ్, గిరిధర్, అసిస్టెంట్ లీగల్ ఏయిడ్ కౌన్సిల్ ఆర్.రజినీ, జైలు సందర్శక న్యాయవాది టి.సునిత, ఇంఛార్జి సూపరింటెండెంట్ యన్.ప్రభాకర్ రెడ్డి .మరియు ఖైదీలు పాల్గొన్నారు.

## కటాక్షపురం గ్రామస్తులకు బిజెపి అండగా ఉంటుంది

- స్టోన్ క్రషర్లను మూసివేసే వరకు ప్రజలతో కలిసి ఆందోళన చేస్తాం
- జిల్లా బిజెపి కౌన్సిల్ మెంబర్ గట్టు వేణు గౌడ్



**ఆత్మకూర్, మే 23 (జనం సాక్షి):**స్టోన్ క్రషర్ల యాజమాన్యం గుట్టలను భారీ బోరు బ్లాస్టింగ్ తో పేల్చడంతో విపరీతంగా దస్టు దుమ్ము దూళితో గ్రామ ప్రజలు అనారోగ్యాని గురవుతున్న అధికారులు ప్రజాప్రతినిధులు పట్టించుకోవడంలేదని జిల్లా బిజెపి కౌన్సిల్ మెంబర్ గట్టు వేణు గౌడ్ అన్నారు. శనివారం ఆత్మకూరు మండలం పెద్దాపురం లో విలేకరులతో మాట్లాడుతూ కటాక్షపురం గ్రామస్తులు దుమ్ముదలి స్టోన్ డస్టును ఇండ్లకు రావడంతో తట్టుకోలేక జాతీయ రహదారిపై ధర్నా రాస్తారోకో చేసిన కూడా అధికారులు ఎందుకు స్పందించడం లేదని ఆయన ప్రశ్నించారు. స్టోన్ క్రషర్ను మూసివేసే వరకు గ్రామస్తులకు బిజెపి పార్టీ అండగా ఉంటుందని అన్నారు. ప్రజలు చిన్నారులు వృద్ధులు గర్భిణీలు అనారోగ్యాలకు గురవుతున్న ప్రస్తుతం ఎందుకు స్పందించడం లేదని జిల్లా బిజెపి నాయకుడు ప్రశ్నిస్తున్నారు. వెంటనే జిల్లా ఉన్నతాధికారులు కటాక్షపురం గ్రామంలోని స్టోన్ క్రషరు ను మూసివేయాలని జిల్లా అధికారులను కోరారు. పక్షం రోజుల్లో సీజీ చేయకుంటే కటాక్షపురం గ్రామస్తులతో కలిసి జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు ఆందోళనలు చేస్తామని ఆయన హెచ్చరించారు. ఇక్కడ జరుగుతున్న అన్యాయం ప్రజలు పడుతున్న అవస్థలను జిల్లా కమిటీకి రాష్ట్ర బిజెపి కమిటీ దృష్టికి తీసుకుపోయి కటాక్షపురం ప్రజలకు న్యాయం జరిగే వరకూ వదిలిపెట్టమని గట్టు వేణు గౌడ్ అన్నారు. నాడు బి ఆర్ ఎస్ నేడు కాంగ్రెస్ ప్రభుత్వాల పాలనలో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆయన అన్నారు. నిరుపేదలకు బిజెపి పార్టీ అండగా ఉంటుంది కటాక్షపురం ప్రజలు అధైర్య పడవద్దు అని జిల్లా బిజెపి కౌన్సిల్ మెంబర్ గట్టు వేణు గౌడ్ భరోసా ఇచ్చారు. ఈ సమావేశంలో మండల పార్టీ అధ్యక్షుడు ఉప్పుగల్ల శ్రీకాంత్ రెడ్డి, మాజీ బిజెపి మండల పార్టీ అధ్యక్షులు ఈర్సండ్ల సదానందం, మండల బిజెపి ఉపాధ్యక్షులు పూజారి రవి గౌడ్, బయ్యా కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

# ఓటర్ల మ్యాపింగ్‌లో 92.24 శాతంతో రాష్ట్రంలో మహబూబాబాద్ మొదటి స్థానం

## జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్



**మహబూబాబాద్ ప్రతినిధి, మే 23 (జనం సాక్షి):**శనివారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కె. అనిల్ కుమార్ వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ మాట్లాడుతూ, ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)కు ముందస్తు సన్నాహాల్లో భాగంగా నిర్వహిస్తున్న ఓటర్ల మ్యాపింగ్‌లో మహబూబాబాద్ జిల్లా 92.24 శాతం పూర్తి చేసి రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలిచిందన్నారు. 2002 మరియు 2025 ఓటరు జాబితాల్లో పేర్లు ఉన్న ఓటర్లు ఎలాంటి అదనపు ధ్రువపత్రాలు సమర్పించాల్సిన అవసరం లేదని తెలిపారు. ప్రస్తుతం జరుగుతున్న మ్యాపింగ్ ప్రక్రియలో అవసరమైన ధ్రువపత్రాలు సమర్పించాలని సూచించారు .భారత్ ఎన్నికల చట్టం ప్రకారం బీఎల్‌వోలు క్షేత్రస్థాయిలో ఓటరు జాబితా తయారీ, సవరణలు చేపడుతున్నారని, ఓటరు జాబితా సమగ్రతను కాపాడేందుకు ఎన్నికల సంఘం ప్రతి ఎన్నికలకు ముందు లేదా అవసరాన్ని బట్టి సవరణలు నిర్వహిస్తుందని పేర్కొన్నారు. ప్రస్తుతం ప్రజలు తరచూ వలసలు వెళ్తుండటంతో ఒకే వ్యక్తి పేరు ఒకటి కంటే ఎక్కువ ప్రాంతాల్లో నమోదు కావడం, మరణించిన ఓటర్ల పేర్లు తొలగించకపోవడం వంటి సమస్యలు ఏర్పడుతున్నాయని తెలిపారు. అర్హులైన ప్రతి పౌరుడు ఓటరు జాబితాలో ఉండేలా, అనర్హులు చేర్చబడకుండా ఉండే లక్ష్యంతో ఎన్నికల సంఘం ఈ ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. ఎస్ఐఆర్ సవరణ కార్యక్రమానికిఅన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని కలెక్టర్ కోరారు. ఈ సమావేశంలో రాజకీయ పార్టీల ప్రతినిధులు మార్నేని వెంకన్న, సురేష్ నాయుడు, శ్యామ్ లోయ శర్మ, చక్రపాణి, కలెక్టరేట్ పరిపాలన అధికారి పవన్ కుమార్, సూపరింటెండెంట్ కిరణ్, రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

# వరి కొయ్యలను తగలబెడితే అపార నష్టమని -సీఐ మల్లేష్

### పర్యావరణాన్ని కాపాడుకుందాం..భూమాతను రక్షించుకుందాం



**చిట్యాల, మే 23( జనం సాక్షి):**వరి కోతలు ముగిసిన తర్వాత పొలాల్లో మిగిలిపోయే వరి కొయ్యలను, గడ్డిని దహనం చేయడం వల్ల భూమికి, పర్యావరణానికి తీవ్ర నష్టం వాటిల్లుతుందని చిట్యాల సీఐ దగ్గు మల్లేష్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ లో గల తన చాంబర్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అవగాహన లేమితో రైతులు చేస్తున్న ఈ చిన్న పొరపాటు భవిష్యత్ లో పెద్ద నష్టాలకు దారితీస్తుందని, పంట వ్యర్థాలను కాల్చడం వల్ల మట్టిలోని తేమ మొత్తం ఆవిరైపోతుందని, అంతేకాకుండా భూమికి అవసరమైన సేంద్రీయ కర్బనమ్, నత్రజని, భాస్వరం, పొటాషియం వంటి ముఖ్యమైన పోషకాలు మంటల్లో కాలిపోయి వృధాగా ఆవిరైపోతాయన్నారు. అదేవిధంగా మంటల వేడికి భూమి పై పొరల్లో ఉండి పంటకు మేలు చేసే ఎన్నో సూక్ష్మజీవులు, వానపాములు మరణిస్తాయన్నారు. అలాగే పొలాల్లో తిరిగే పాములు, ముంగిసలు, ఉడుములు వంటి పర్యావరణానికి మేలు చేసే జీవరాశులు సైతం కాలి బుడిదవుతాయన్నారు. దీంతో నేల గట్టిపడి తదుపరి పంట వేయడానికి భూమిని దున్నడం కష్టమవుతుందన్నారు. వరి మాగిళ్లను కాల్చడం వల్ల విపరీతమైన పొగ బూడిద గాలిలో కలిసిపోయి వాయు కాలుష్యం పెరుగుతుందన్నారు. ఈ కాలుష్యం వల్ల చిన్న పిల్లలు, వృద్ధులకు ఊపిరితిత్తుల సమస్యలు, అస్తమా వంటి తీవ్ర అనారోగ్య సమస్యలు వస్తాయని, అంతేకాకుండా పక్క పొలాల్లోని పంటలకు మంటలు వ్యాపించి పెను ప్రమాదం జరిగే అవకాశాలు ఉన్నాయన్నారు. రైతులు వరి కొయ్యలను కాల్చకుండా వ్యవసాయ యంత్రాలతో వాటిని చిన్న ముక్కలుగా చేసి, పొలంలో నీరు పెట్టి ట్రాక్టర్ రోటావేటర్ లేదా కేజ్ విల్ చక్రాలతో కలియ దున్నాలని, దీనికి ఎకరాకు 50 కేజీల సింగిల్ సూపర్ ఫాస్పేట్ లేదా వేస్ట్ డీకంపోజర్ ను వాడితే రెండు మూడు వారాల్లో వరి కొయ్యలు కుళ్లిపోయి ఎకరానికి దాదాపు టన్ను వరకు అత్యంత విలువైన సేంద్రీయ ఎరువు తయారవుతుందన్నారు. దీనివల్ల తదుపరి పంట దిగుబడి 5 నుండి 10 శాతం వరకు పెరిగే అవకాశం ఉందన్నారు. వరి కొయ్యలను పొలాల్లో తగలబెట్టడం చట్టరీత్యా నేరమని, అలా నిబంధనలు ఉల్లంఘిస్తే ప్రభుత్వపరంగా చర్యలు తీసుకునే అవకాశం ఉందని ఆయన హెచ్చరించారు. కాబట్టి రైతులు వరి మాగిళ్లను కాల్చడం మానేసి, భూమిలో కలియదున్ని భూసారాన్ని పెంచుకో వాలన్నారు. రైతులందరూ పంట వ్యర్థాలను కాల్చి వేయకుం డా..పర్యావరణాన్ని కాపాడుకునేందుకు.. భూమాతను రక్షిం చుకునేందుకు కంక వనం కావాలని ఈ సందర్భంగా సీఐ మల్లేష్ రైతులకు పిలుపునిచ్చారు.

# మాజీ సర్పంచుల పెండింగ్ బిల్లుల చెల్లించాలి

### ఎంపీడీవోకు వినతి పత్రం అందజేసిన మాజీ సర్పంచులు

**నడికుడ మే 23 (జనం సాక్షి) :** మాజీ సర్పంచుల పెండింగ్ బిల్లులు వెంటనే విడుదల చేయాలని నడి కూడ మండల మాజీ సర్పంచ్ల ఫోరం అధ్యక్షులు తిప్పర్తి సాంబశివరెడ్డి ఆధ్వర్యంలో శనివారం నడి కూడ మండల పరిషత్ అభివృద్ధి అధికారికి నడి కూడ మండల మాజీ సర్పంచ్లు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2019 నుండి 2024 కాలంలో గ్రామాలు అభివృద్ధి ధ్యేయంగా సిసి రోడ్, సైడ్ డ్రైనేజీ లు, పల్లె ప్రకృతి వనాలు, పైపులైన్ లు, లైటింగ్, గ్రామంలో నూతన ట్రాక్టర్, నూతన టాంకర్, డంపింగ్ యార్డ్ ,గ్రామ పంచాయతీ నూతన భవనాలు, రైతు వేదికలు, గ్రామాల్లో అభివృద్ధిలో భాగంగా అప్పులు తెచ్చి పనులు చేయడం జరిగింది. 2023 – 2024 మధ్య కాలంలో మిగిలి పోయిన పెండింగ్ బిల్లులు రాక సర్పంచులు ఆత్మ హత్య చేసుకునే పరిస్థితి ఉన్నది కావున గ్రామపంచాయతీ 15 వ ఫైనాన్స్ నుండి డబ్బులు వెంటనే రిలీజ్ చేయాలని కోరడం జరిగింది ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచులు నడికూడ మాజీ సర్పంచ్ ఊర రవీందర్ రావు, ముస్త్యాలపల్లి మాజీ సర్పంచ్ బోట్ల సంధ్య రవీందర్, పులిగిల్ల మాజీ సర్పంచ్ సదానందం, కౌకొండ మాజీ సర్పంచ్ రమేష్, సర్వాపురం మాజీ సర్పంచ్ శ్రీలత రవీందర్, పాల్గొన్నారు



# రైతు కండ్ల ముందే కాలి బూడిదైన పంట

**గంగారం మే 23 (జనం సాక్షి)**గంగారం మండలం బావురుగొండ గ్రామానికి చెందిన వజ్జ జంపయ్య, చుంచ పాపయ్య రైతులు ఆరబోసిన మొక్కజొన్న పంటకు మరియు పొలంలోని పైపులకి అకస్మాత్తుగా ఎరగలు (నిప్పురవ్వలు/మంటలు) అంటుకున్నాయి. ఎండ తీవ్రతకు మంటలు క్షణాల్లో వ్యాపించడంతో,తమ ఏడాది కష్టం అగ్నికి ఆహుతి కావడంతో ఆ రైతుల కళ్ళల్లో నుంచి కారే నీళ్లు చూసి అక్కడికి మంటలు ఆర్పేందుకు వచ్చిన రైతులు కూడా బాధతో కన్నీళ్లు కార్చారు . సమాచారం అందుకున్న స్థాని కులు మంటలను అదుపు చేయడానికి ప్రయత్నించినప్పటికీ, అప్పటికే నష్టం జరిగిపోయింది. లక్షల రూపాయల మేర నష్టం వాటిల్లినట్లు తెలుస్తోంది. ప్రభుత్వం స్పందించి తమను ఆర్థికంగా ఆదుకోవాలని బాధితులుఆవేదనవ్యక్తం చేస్తున్నారు.



# పప్పు జాతి దినుసులు ఎక్కువగా సాగు చేయాలి



**నల్లబెల్లి, మే 23 (జనంసాక్షి):** పప్పు జాతి దినుసులు ఎక్కువగా సాగు చేయాలని మండల వ్యవసాయ అధికారి బన్న రజిత పేర్కొన్నారు. శనివారం మండలంలోని దస్తగిరి పల్లె గ్రామం లో ఏరువాక రైతు సాగుబడి కార్యక్రమాన్ని సర్పంచ్ పులి రమేష్ గౌడ్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మొక్కజొన్న, వరి అవశేషాలను కాల్చకుండా డీకంపోజర్ వేసి రోటవేటర్ తో కలియ దున్నాలన్నారు. దీనివల్ల సేంద్రియ కర్బన శాతం తగ్గకుండా ఉంటుందని తెలిపారు. అలాగే జీలుగు, పెసరు పొలంలో వేసుకొని పచ్చిరొట్టె విధానాన్ని రైతుల పాటించాలన్నారు. దీంతో ఎరువుల వాడకం తగ్గించవచ్చునని తెలిపారు. పంట మార్పిడి విధానంతో అధిక దిగుబడులు రావటం వచ్చునని రైతులకు సూచించారు. అనంతరం సర్పంచ్ మాట్లాడుతూ వ్యవసాయ శాఖ, అగ్రికల్చర్ యూనివర్సిటీ వారు ఇచ్చే కందులను రైతులు తప్పకుండా పండించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ శివకుమార్, రైతులు పాల్గొన్నారు.

# బోర్లగూడెంలో రిజర్వాయర్ ఏర్పాటు చేయాలి

### కుల ప్రజా సంఘాల జిల్లా చైర్మన్ పీక కిరణ్



**మహా ముత్తారం మే 23 (జనం సాక్షి)**దేవాదుల ప్రాజెక్టు ద్వారా బోర్లగూడెంలో రెండు టి ఎం సి ల సామర్థ్యం గల రిజర్వాయర్ ఏర్పాటు చేసి 15 గ్రామ పంచాయతీలో గల రైతులకు సాగు నీరు అందించాలని కుల సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ భూపాలపల్లి జిల్లా చైర్మన్ పీక కిరణ్ డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రంలో కుల సంఘాల జేఏసీ మండల కమిటీని ఎన్నుకోవడం జరిగింది. ఈ సమావేశంలో కిరణ్ మాట్లాడుతు గోదావరి నుండి మహా ముత్తారం మండలానికి సంబంధించిన గ్రామ గ్రామాలకు రెడ్డిపల్లి, బోర్లగూడెం, నర్సింగాపురం గొల్ల బుద్ధారం రిజర్వాయర్లో నీళ్లు తరిలి తరలిపోతున్నాయని, 2 వేల కోట్లు కేటాయించి బోర్లగూడెంలో రిజర్వాయర్ మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. మండలంలో మంజూరైనటువంటి రోడ్లను గుత్తేదారులను పిలిచి వెనువెంటనే ప్రారంభించాలని విజ్ఞప్తి చేశారు. వర్షాకాలం దృష్టిలో ఉంచుకొని అతి తొందరగా మండలంలో చెరువుల పూడక తీత పనులు చేయాలని, శిఖం భూములు అన్యాక్రాంతం అవుతున్నాయని రెవెన్యూ శాఖ ఇరిగేషన్ శాఖ అధికారులు చూస్తూ ఊరుకుంటున్నారని కిరణ్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ అజ్మీరా పూల్ సింగ్ నాయక్,, జిల్లా కోఆర్డినేటర్ రాజాబాబు, ఆల్ ఇండియా అంబేద్కర్ సంఘం మండల అధ్యక్షులు రామగిరి రాజు, మందాల రాజిరెడ్డి, రాధారపు స్వామి, ముక్కెర వెంకటస్వామి,బోడ బాలాజీ, పంగా సంపత్, లింగమల్ల సదవలి రావు, మార్క రాము గౌడ్, పాల్గొన్నారు.

# ప్రజా పాలన ప్రభుత్వంలోనే నిజమైన అభివృద్ధి సాధ్యం

### ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి



**వరంగల్ ప్రతినిధి, మే 22 (జనంసాక్షి):**గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 17వ డివిజన్ బొల్లికుంట గ్రామంలో రూ. 60 లక్షల నిధులతో చేపడుతున్న కూడలి అభివృద్ధి పనులు, సీసీ రోడ్లు, మురుగు కాలువల నిర్మాణ పనులకు పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి శంకుస్థాపన చేశారు. శనివారం 17వ డివిజన్ లో వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, హన్మకొండ జిల్లా కలెక్టర్,ఇంచార్జ్ మున్సిపల్ కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్, జీడబ్ల్యూఎంసీ మాజీ మేయర్ గుండు సుధారాణి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి మాట్లాడుతూ, పట్టణాల అభివృద్ధి లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని అన్నారు. ప్రతి కాలనీలో మౌలిక సదుపాయాల మెరుగుదలకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొని లబ్ధిదారులను శాలువాలతో సన్మానించి, కుటుంబ సభ్యులతో ఆనందాన్ని పంచుకున్నారు. ఈ కార్యక్రమానికి ప్రజా ప్రతినిధులు, సంబంధిత శాఖ ల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి పనులను ప్రారంభించనున్న మంత్రి



**ఖానాపూర్ మే 23 (జనం సాక్షి)**నియోజకవర్గ కేంద్రంలోని బొడ్డోనికుంట సుందరీకరణ కోసం 1.21 కోట్ల నిధులతో ఎమ్మెల్యే వెడ్మా బొజ్జు పటేల్ ఆధ్వర్యంలో జిల్లా మంత్రి జూపల్లి కృష్ణారావు పనులను ప్రారంభించనున్నారు. శనివారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు విలేకరులతో మాట్లాడారు. మధ్యాహ్నం 1:30 నిమిషాలకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. నియోజకవర్గ అభివృద్ధిలో భాగంగా ఎమ్మెల్యే బొజ్జు పటేల్ ప్రత్యేక శ్రద్ధతో బొడ్డోని కుంట సుందరీకరణకు స్వీకరించినట్లు తెలిపారు. ఈ విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ పార్టీ మండల శాఖ అధ్యక్షుడు జంగిలి శంకర్, పట్టణ శాఖ అధ్యక్షుడు గౌరె గంగాధర్, ఆత్మ కమిటీ చైర్మన్ తోట సత్యం, జిల్లా కాంగ్రెస్ పార్టీ వైస్ ప్రెసిడెంట్ రాజుర సత్యం, 7వ వార్డు కౌన్సిలర్ నిమ్మల రమేష్, సర్పంచు ల ఫోరం మండల శాఖ అధ్యక్షుడు రాజు నాయక్, మాజీ మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ లు అంకం రాజేందర్, కావలి సంతోష్ లతోపాటు నాయకులు జమాల్ ఖురేషి, అమనుల్లా ఖాన్, పాల్గొన్నారు.

# అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్‌కు ఘన వీడ్కోలు



**నిర్మల్ రురల్,మే23, (జనంసాక్షి)** బదిలీపై వెళ్తున్న జిల్లా అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్ కి తెలంగాణ జర్నలిస్టు యూనియన్( ఐజేయు) నాయకులు ఘన వీడ్కోలు పలికారు. శనివారం నిర్మల్ పట్టణంలోని ఏ ఎన్ రెడ్డి కాలనీలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో యూనియన్ ప్రతినిధులు ఆయనను శాలువాతో సత్కరించి, పూలమాలలు వేసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ జిల్లాకు అందించిన విశేష సేవలను జర్నలిస్టులు ఈ సందర్భంగా గుర్తుచేసుకున్నారు. ఆయన తన పదవీ కాలంలో జిల్లా సమగ్ర అభివృద్ధికి, ప్రజా సమస్యల త్వరితగతిన పరిష్కారానికి ఎంతో అంకితభావంతో పనిచేశారని యూనియన్ నాయకులు కొనియాడారు. ముఖ్యంగా మీడియా ప్రతినిధులు ఎదుర్కొంటున్న సమస్యల పట్ల ఆయన ఎల్లప్పుడూ సానుకూల దృక్పథంతో స్పందించేవారని, క్షేత్రస్థాయిలో జర్నలిస్టులకు ఎంతో సహకారం అందించారని వారు కృతజ్ఞతలు తెలియజేశారు. రాబోయే రోజుల్లో వారు మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని, నూతన ప్రాంతంలోనూ తన విలక్షణమైన శైలితో ప్రజలకు సేవలందించాలని ఆకాంక్షించారు. ఈ ఘన సన్మాన కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు కొండూరు రవీందర్, జిల్లా ప్రధాన కార్యదర్శి వెంక గారి భూమయ్య, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గాండ్ల రాజశేఖర్, సోషల్ మీడియా జిల్లా కన్వీనర్ యోగేష్, జిల్లా ఉపాధ్యక్షులు గుమ్మల అశోక్, సంయుక్త కార్యదర్శి సట్ల హనుమన్లు వీరితో పాటు జిల్లా సభ్యులు సాంకేత్ వర్ధన్, సిండే మహేష్, రవికుమార్, డీఎస్ మధు, గంగాధర్, నరసయ్య, శ్రీనివాస్, మహేష్ కుమార్, రవికుమార్, భోజన్న, సంతోష్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు ముఖ్య గమనిక కొందరు పేర్లు తెలియకపోవడంతో. పెట్టలేదు యాడ్ చేసుకోగలరు.

# ఉర్సు చెరువు బండ్ సుందరీకరణ పనులను పూర్తి చేయాలి

## అభివృద్ధి పనుల పురోగతిని పరిశీలించిన జిల్లా కలెక్టర్లు

**వరంగల్ ఈస్ట్, మే 23 (జనం సాక్షి)**హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహాత్ బాజ్ పాయి, వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద శనివారం పబ్లిక్ హెల్త్ శాఖ ఆధ్వర్యంలో కొనసాగుతున్న ఉర్సుగుట్ట -- రంగసముద్రం చెరువు బండ్ సుందరీకరణ మరియు అభివృద్ధి పనుల పురోగతిని ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ సందర్భంగా పనుల నాణ్యత, పురోగతిపై అధికారులతో సమీక్ష నిర్వహించిన కలెక్టర్లు, అభివృద్ధి పనులను మరింత వేగవంతం చేసి నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రజలకు ఉపయోగపడే విధంగా పనులు ప్రమాణాలతో చేపట్టాలని సూచించారు. అదేవిధంగా చెరువు బండ్ పరిసరాలను ఆకర్షణీయంగా తీర్చిదిద్దడంతో పాటు ప్రజలకు మెరుగైన వాతావరణం కల్పించే దిశగా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో బల్దియా ఇంజినీర్ సంతోష్ బాబు, సిటీ ప్లానర్ రవీంద్ర రాడేకర్, తహసిల్దార్ ఇక్బాల్ సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు



# చట్టాల పై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలి




**బోథ్, మే 23(జనంసాక్షి)**చట్టాల పై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని బోథ్ జూనియర్ సివిల్ కోర్టు జడ్జి కుంభం సందీప్ అన్నారు. శనివారం సొనల మండలం కేశవ్ గూడా,సంపత్ నాయక్ తండాల్లో తెలంగాణ హైకోర్టు ఆదేశానుశారం సోనాల మొబైల్ లోక్ అదాలత్ అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్న చిన్న సమస్యలకు తక్షణమార్గం లోక్ అదాళతే అని,ఖర్చు లేకుండా సమస్యలను లోక్ అదాలత్ లో పరిష్కరించుకోవచ్చని తెలిపారు. పల్లెలలో చట్టాలపై తమ హక్కులపై అవగాహన లేకపోవడం వల్ల చాలామంది నేరాలకు పాల్పడుతున్నారని అన్నారు. ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగివుండి బాధ్యత తో నడుచుకోవాలని తెలిపారు. యువత గంజాయి,గుడుంబా లాంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని తెలిపారు. బాల్య వివాహాలను ప్రోత్సహించరదని సూచించారు. పల్లెలు దేశానికి పట్టుకొమ్మలని చెప్పారు. యువత చెడు అలవాట్లకు లోనయి తమ జీవితాలను నాశనం చేసుకోకుండా మంచి మార్గంలో నడవాలని సూచించారు. పల్లెల్లో ఉన్న సమస్యలను తెలుసుకుని తమ వంతు కృషి చేస్తానని తెలిపారు. పిల్లలను విధిగా పాఠశాలలకు పంపాలన్నారు. ఈ కార్యక్రమంలో అడ్వకేట్ లు సిర్పూర్ మహేష్ ,సందేశ్, చౌహాన్ అర్జున్ సింగ్, పంచాయతీ సెక్రెటరీ శ్రీకాంత్ సంపత్ నాయక్ తండ మాజీ సర్పంచ్ సాకారం, గ్రామస్థులు విలాస్,ఇందాల్ సింగ్, ప్రతాప్ సింగ్ కేశవగూడ గ్రామస్థులు జైతు పటేల్ , జాకేష్ , శంభు, భీమరాజు తదితరులు పాల్గొన్నారు.

# ఓటర్ల మ్యాపింగ్‌లో 92.24 శాతం రాష్ట్రంలో మహబూబాబాద్ జిల్లా మొదటి స్థానం

- జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్



**మహబూబాబాద్ బ్యూరో, మే 23(జనం సాక్షి):**శనివారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో అదనపు కలెక్టర్ రెవెన్యూ కె. అనిల్ కుమార్, వివిధ పార్టీల ప్రతినిధులతో జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ ఓటర్ల మ్యాపింగ్ పై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ(ఎస్ఐఆర్)కు ముందస్తు సన్నాహాల్లో భాగంగా మ్యాపింగ్ లో రాష్ట్రంలో అత్యధికంగా మహబూబాబాద్ జిల్లాలో 92.24 శాతం మ్యాపింగ్ చేసి రాష్ట్రంలోనే ముందు వరుసలో మహబూబాబాద్ జిల్లా ఉందన్నారు. 2002, 2025.. రెండు ఓటరు జాబితాల్లోనూ పేర్లు ఉంటే ఓటర్లు ఆధారాల కోసం ఎలాంటి ధ్రువపత్రాలు చూపాల్సిన అవసరం లేదు. ప్రస్తుతం జరుగుతున్న మ్యాపింగ్‌లో ధ్రువపత్రాలు సమర్పించాలన్నారు, క్షేత్రస్థాయిలో బిఎల్వోలు, భారత్ ఎన్నికల చట్టం ప్రకారం ఓటర్ జాబితా తయారు చేయడం జరుగుతుందని, సవరణలకు పూర్తిగా అధికారం కలిగి ఉందని, ఓటర్ జాబితా యొక్క సమగ్రతను కాపాడడానికి కమిషన్ ప్రతి ఎన్నికలకు ముందు లేదా అవసరాన్ని బట్టి ఓటరు జాబితా సవరణలకు ఆదేశించడం జరుగుతుందని అన్నారు, ప్రస్తుతం ప్రజలు తరచుగా వలసలు వెళ్లడం వల్ల ఉన్న ఓటరు జాబితాలో అనేక మార్పులు చోటుచేసుకున్నాయని, తద్వారా ఓటరు ఒకటి కంటే ఎక్కువ ప్రదేశాలలో నమోదు అయి ఉన్నారని, మరణించిన ఓటర్లు పేర్లు తొలగించడం, తదితర సమస్యలను ఉత్పన్నమయ్యాయి అని, అందువలన అర్హులైన పౌరుడు కూడా ఓటరు జాబితా నుండి తప్పి పోకుండా అలాగే ఏ అనర్హుడు కూడా ఇందులో చేర్చబడుతుందని ముఖ్య లక్ష్యంతో ఎన్నికల సంఘం ఈ ప్రత్యేక సమగ్ర సవరణ ను ప్రకటించింది అన్నారు.

ఎస్ ఐ ఆర్ సవరణ కోసం అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులు కూడా సహకరించాలని కోరారు. ఈ సమావేశంలో రాజకీయ పార్టీ ప్రతినిధులు మార్నేని వెంకన్న, సురేష్ నాయుడు, శ్యామ్ లోయ శర్మ, చక్రపాణి, కలెక్టరేట్ పరిపాలన అధికారి పవన్ కుమార్, సూపర్డెంట్ కిరణ్, రంజిత్ తదితరులు ఉన్నారు.

# కోపాకుల చెరువు మట్టి అక్రమ తరలింపు

## చోద్యం చూస్తున్న రెవెన్యూ, నీటిపారుదల శాఖ అధికారులు



**చెన్నారావుపేట, మే 23 ( జనం సాక్షి):** చెన్నారావుపేట గ్రామ శివారులోని కోపాకుల ఊర చెరువులోని మట్టిని అక్రమంగా తరలిస్తున్నారు. అక్రమంగా మట్టిని తరలించకుండా అడ్డుకొని అరికట్టాల్సిన రెవెన్యూ, నీటిపారుదల శాఖ అధికారులు తమకేమీ పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారని ఆయకట్టు రైతులు, ముదిరాజ్ కులస్తులు పలువురు అగ్రహం వ్యక్తం చేస్తున్నారు. శనివారం గ్రామ శివారులోని కోపాకుల ఊర చెరువులో ఇటాచి సహాయంతో క్రమంగా తవ్వకాలను చేపడుతూ టిప్పర్లలో మట్టిని గుర్తుతెలియని వ్యక్తులు నర్సంపేట పట్టణానికి యదేచ్ఛగా తరలిస్తున్నారు. నాయకట్టు రైతులు, ముదిరాజ్ కులస్తులు, ముదిరాజ్ సంఘం నాయకులు రెవెన్యూ, నీటిపారుదల శాఖ అధికారులకు సమాచారం అందిస్తే తమకు ఏమీ పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అక్రమంగా ఊర చెరువులో తవ్వకాలు చేపట్టడం మూలంగా ఊర చెరువు మొత్తం గుంతల మయంగా మారనుందని చేపలు పట్టడానికి ఇబ్బందికరంగా ఉంటుందని ముదిరాజ్ కులస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా రెవెన్యూ, నీటిపారుదల శాఖ అధికారులు స్పందించి కోపాకుల ఊర చెరువులో అక్రమ తవ్వకాలు చేపడుతూ మట్టిని అక్రమంగా తరలిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని ఆయకట్టు రైతులు, ముదిరాజ్ కులస్తులు, ముదిరాజ్ సంఘం నాయకులు కోరుతున్నారు.

# రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు

## బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్

**బెల్లంపల్లి, మే 23, (జనంసాక్షి)**వరిధాన్యం కొనుగోలు విషయం లో రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ప్రతి గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ భరోసా ఇచ్చారు. శనివారం ఆయన బెల్లంపల్లి మండలంలోని చంద్రవెల్లి గ్రామపంచాయతీలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్ తో కలిసి సందర్శించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే గడ్డం వినోద్ మాట్లాడుతూ వరిధాన్యం కొనుగోలు విషయంలో రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ప్రతి గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని స్పష్టం చేశారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కొనుగోలు ప్రక్రియను సజావుగా నిర్వహించాలని అధికారులకు సూచించారు. లారీల కోసం ఆలస్యం చేయకుండా తక్షణం ఏర్పాటు చేయాలని, సంచుల విషయంలో కూడా ఎలాంటి కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. రైతులు ఇబ్బందులు పడకుండా అన్ని ఏర్పాట్లు పూర్తిగా ఉండాలని చెప్పారు. హమాలీలు, కూలీల సంక్షేమాన్ని కూడా దృష్టిలో ఉంచుకుని వారికి అవసరమైన సౌకర్యాలు కల్పించాలని సూచించారు. రైతులు పరస్పరం సమన్వయంతో వ్యవహరిస్తూ కొనుగోలు ప్రక్రియను సాఫీగా సాగించేలా సహకరించాలని ఎమ్మెల్యే కోరారు. ఆయన వెంట మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కారుకూరి రాంచందర్, దావ రమేష్, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.



# సీఎం సభ విజయవంతానికి నాయకులు కృషి చేయాలి

## డిసిసి అధ్యక్షురాలు ఆత్రం సుగుణక్క



**రెబ్బెన, మే 23(జనం సాక్షి ):**జిల్లాలో నిర్వహించనున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సభను చారిత్రాత్మకంగా విజయవంతం చేయాలని డీసీసీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణక్క కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. శనివారం రెబ్బెన మండల కేంద్రంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కిషన్ గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు.
ఈ సందర్భంగా సుగుణక్క మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించాల్సిన బాధ్యత పార్టీ శ్రేణులపై ఉందన్నారు. ముఖ్యమంత్రి సభకు మండలంలోని ప్రతి గ్రామం నుంచి పెద్ద ఎత్తున ప్రజలను తరలించేలా నాయకులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. సభ విజయవంతం పార్టీ ప్రతిష్ఠకు సంబంధించిన అంశమని, అందరూ సమిష్టిగా పనిచేయాలని కోరారు.కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కార్యకర్తలే ప్రధాన బలమని పేర్కొంటూ, గ్రామస్థాయిలో పార్టీ కార్యక్రమాలను మరింత చురుకుగా నిర్వహించాలని సూచించారు. నాయకులు పరస్పర సహకారంతో ముందుకు సాగితే జిల్లాలో కాంగ్రెస్ మరింత బలపడుతుందని తెలిపారు.ఈ సమావేశంలో డీసీసీ ఉపాధ్యక్షుడు ప్రకాష్ రావు, అధికార ప్రతినిధి దుర్గం రవీందర్, జిల్లా కార్యదర్శులు దుర్గం దేవాజీ, చిరంజీవి గౌడ్, చెన్న సోమశేఖర్, ఐఎన్‌టీయూసీ నాయకులు, సర్పంచులు, మాజీ ప్రజాప్రతినిధులు, యువజన కాంగ్రెస్, మహిళా విభాగం నాయకులు, పార్టీ అనుబంధ సంఘాల ప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# వడదెబ్బతో మృతి చెందిన రైతు కుటుంబానికి 5 లక్షలు ఎక్స్గ్రేషియా ప్రకటించాలి



**వరంగల్ ఈస్ట్, మే 23 (జనం సాక్షి)** ఈనెల 19వ తేదీన సంగేశీ మండలం గవిచెర్ల గ్రామానికి చెందిన గుండు వెంకట నర్సు వడదెబ్బతో మృతి చెందినందున ఆయన కుటుంబానికి 5 లక్షల రూపాయలు ఎక్స్గ్రేషియా ఇవ్వాలని రైతు సంఘాల నాయకులు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు .వారు ఈరోజు గవి చర్ల గ్రామానికి వెళ్లి వెంకట నర్సు కుటుంబ సభ్యులను కలిసి జరిగిన విషయాలను అడిగి తెలుసుకున్నారు.వెంకట నర్సు గ్రామంలో ఉపాధి హామీ పథకం ద్వారా ఊర చెరువులో జరుగుతున్న పనులలో పాల్గొని ఇంటికి తిరిగి వచ్చిన పిదప వడదెబ్బతో సాయంత్రము మృతి చెందాడని వారి కుటుంబ సభ్యులు తెలిపారన్నారు. ప్రతి వేసవి కాలం గ్రామాలలో గ్రామీణ ఉపాధి హామీ పథకం క్రింద జరిగే పనుల కార్యక్రమాలలో ప్రజలకు సరైన సౌకర్యాలు కల్పించడంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమవుతున్నాయని వారి విమర్శించారు వారికి కావలసిన మంచినీరు వైద్య సదుపాయం టెంట్లు పనికి ఉపయోగించే పనిముట్లు ఓ ఆర్ ఎస్ పాకెట్లు ప్రజలకు అందుబాటులో ఉండడం లేదన్నారు. దీని మూలంగా కరువు పనిలో పాల్గొన్న గ్రామస్తులు అస్వస్థత గురైనప్పుడు తక్షణ సహాయం అందడం లేదన్నారు గత 15 రోజులుగా ఎండలు తీవ్రంగా ఉండడంతో ప్రతిరోజు ఎండ దెబ్బకు కరువు పనుల్లో పాల్గొన్నటువంటి గ్రామస్తులు అస్వస్థత గురి మరణిస్తున్నారని అన్నారు . వెంటనే వారికి తగిన సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు కరువు పనుల్లో పాల్గొని మరణించిన వారి కుటుంబాలకు గత సంవత్సరం నాలుగు లక్షల ప్రకటించినా రెండు లక్షలు మాత్రమే ఎక్స్గ్రేషియా ఇస్తున్నారని దీనిని ఐదు లక్షల రూపాయలకు పెంచి అమలు చేయాలని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను వారు డిమాండ్ చేశారు. వెంకట నర్సు కుటుంబ సభ్యులను కలిసిన వారిలో అఖిలభారత రైతు కూలీ సంఘం (ఏఐకేఎంఎస్) వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి రాచర్ల బాలరాజు తెలంగాణ రైతు సంఘం ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి ఓదెల రాజయ్య ఉపాధ్యక్షులు ఊరటి హంసల్ రెడ్డి నాయకులు కృష్ణ తిరుపతి ఐలయ్య స్థానిక పంచాయతీ వార్డు మెంబర్ సభ్యులు తో పాటు తదితరులున్నారు.

# గుర్తుతెలియని మృతదేహానికి అంత్యక్రియలు



**తాండూర్ మే 23( జనం సాక్షి)**తాండూర్ పోలీస్ స్టేషన్ సబ్ ఇన్స్పెక్టర్ లేఖ ద్వారా అందించిన అధికారిక విజ్ఞప్తి మేరకు, కొత్తపల్లి గ్రామ శివారులో లభ్యమైన గుర్తుతెలియని పురుష మృతదేహానికి కొత్తపల్లి గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో గౌరవప్రదంగా అంత్యక్రియలు నిర్వహించబడినవి.పోలీస్ శాఖ వారు చట్టపరమైన విచారణ, పంచనామా మరియు పోస్టుమార్టం ప్రక్రియలను పూర్తి చేసిన అనంతరం, మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించుటకు గ్రామపంచాయతీ సహకారం కోరినందున, గ్రామపంచాయతీ తక్షణమే స్పందించి అవసరమైన సిబ్బంది మరియు కార్మికులను ఏర్పాటు చేసి కార్యక్రమాన్ని నిర్వహించినది.మానవత్వమే ప్రధాన ధర్మమనే భావనతో, ఎవరూ లేని పరిస్థితిలో కూడా ప్రతి మనిషికి చివరి గౌరవం దక్కాలనే ఉద్దేశంతో గ్రామపంచాయతీ ఖర్చులతో ఈ కార్యక్రమాన్ని బాధ్యతాయుతంగా పూర్తి చేశారు .ఈ సందర్భంగా గ్రామపంచాయతీ అధికారులు మాట్లాడుతూ, ప్రజా సేవలో భాగంగా మానవీయ విలువలను కాపాడటం ప్రతి స్థానిక సంస్థ బాధ్యత అని తెలిపారు.ఆ మృతుని ఆత్మకు శాంతి చేకూరాలని గ్రామ పంచాయతీ ప్రార్థిస్తున్నదిఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ సిబ్బంది, సంబంధిత కార్మికులు మరియు పోలీస్ శాఖ అధికారులు సమన్వయంతో పాల్గొన్నారు.

# న్యాయమైన డిమాండ్ల పై నిరవధిక సమ్మె



**కౌటాల మే 23 జనం సాక్షి** రోజు రోజుకు పెరుగుతున్న పనులకు సమానంగా జీతాలు లేక కుటుంబాన్ని పోషించడం భారంగా మారుతుందని వీ ఓ ఏ లు ఆవేదన వ్యక్తం చేశారు. కౌటాల మండల కేంద్రంలో శని వారం ఐ కే పి భవనం ముందు 6వ రోజు కండ్లకు నల్ల బ్యాడ్జిలు ధరించి నిరసన చేశారు. తమ న్యాయమైన డిమాండ్స్ నెరవేరే వరకు సమ్మె చేస్తామని అన్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కనీస వేతనం 20వేలు, సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించి హెచ్ ఆర్ పాలసీ వర్తింప జేయాలి. అర్హులైన వీ ఓ ఏ లకు సీ సీ పదోన్నతి, ఆరోగ్య భీమా 20లక్షలు, ట్యాబ్, నెట్ సౌకర్యం కల్పించాలని నిరసన చేశారు. సమ్మె లో జె ఏ సి కౌటాల మండల అధ్యక్షులు ఎల్ములే దత్తు, ఉప అధ్యక్షులు రవి, పద్మ, కార్యదర్శి,మహేశ్వరి, ప్రతిభ, కోశాధికారి, జాడే, జాడే, భీంరావు, శంకర్ లు పాల్గొని నిరసనలో పాల్గొన్నారు. ఏ పి ఎం వినేష్ రావు, సీ సీ లు సమ్మెకు మద్దతు తెలిపారు.

# మాలేగాంలో ఉరి వేసుకొని వ్యక్తి ఆత్మహత్య

**కుబీర్, మే 23, (జనంసాక్షి):** కుబీర్ మండలంలోని మలేగాం గ్రామంలో శుక్రవారం విషాదం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన పుల్లోల్ల గంగాధర్ (56) ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఎస్సై కృష్ణారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం... గంగాధర్ గత కొంత కాలంగా మద్యానికి బానిసయ్యాడు. ఇంట్లో ఎవరూ లేని సమయం చూసి, మద్యం మత్తులో ఉన్న గంగాధర్ తన ఇంటి మెట్ల పక్కన ఉన్న రేకుల షెడ్‌లో నైలాన్ తాడుతో ఉరివేసు కున్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

# రేపాకపల్లె అగ్నిప్రమాద బాధిత కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే జీఎస్సార్



**రేగొండ,మే 23(జనంసాక్షి):**రేగొండ మండలం రేపాకపల్లె గ్రామంలో వరిగడ్డి తగలబెడుతూ జరిగిన అగ్నిప్రమాదంలో మృతిచెందిన రైతు చాగర్ల చంద్రమౌళి(62), భార్య భాగ్య(55) కుటుంబాలను భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు పరామర్శించారు.ఆయన మాట్లాడుతూ దంపతులిద్దరూ మృతి చెందడం అత్యంత ప్రాధాన్యత బాధాకరమని ఆయన అన్నారు. శనివారం ఆయన గ్రామానికి చేరుకుని ఘటనా స్థలాన్ని పరిశీలించి, మృతుని భౌతికకాయానికి నివాళులర్పించారు.అనంతరం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే జీఎస్సార్ మాట్లాడుతూ రైతులు వరి పొలాల్లో గడ్డిని కాల్చకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఇలాంటి అగ్నిప్రమాదాలు ప్రాణ నష్టానికి దారితీసే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. వ్యవసాయ శాఖ అధికారులు గ్రామస్థాయిలో రైతులకు విస్తృతంగా అవగాహన కల్పించి, గడ్డి నిర్వహణపై తగిన సూచనలు ఇవ్వాలని ఆదేశించారు. ఈ ఘటనను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి బాధిత కుటుంబానికి ప్రభుత్వం నుంచి అందాల్సిన సహాయ సహకారాలు అందేలా తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో భూపాలపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ గుటూజ్ కిష్టయ్య, రేగొండ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఇప్పకాయల నర్సయ్య, స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఉపాధి కూలీలకు మజ్జిగ ప్యాకెట్ల పంపిణీ



**వరంగల్ ప్రతినిధి, మే 23 (జనం సాక్షి):**మండుతున్న వేసవికాలంలోఉపాధి హామీ కూలీలకు ఎండ తీవ్రత ఎక్కువ ఉండటం వలన ప్రతి ఒక్కరికి మజ్జిగ ప్యాకెట్లు అందించాలని సంకల్పంతో దుగ్గొండి సర్పంచ్ కామిశెట్టి ప్రశాంత్ కూలీలకు మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు.శనివారం మండల కేంద్రంలో ఉపాధి కూలీలు పనిచేస్తుండగా పని ప్రదేశానికి వెళ్లి కూలీలు డీహైడ్రేషన్ బారిన పడకుండా ఉష్ణోగ్రతల వల్ల అలసట కలగకుండా ఉండడానికి మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేసినట్లు తెలిపారు. ఎండ తీవ్రత ఎక్కువ గా ఉన్నందున ఉదయం 6 గంటలకు వచ్చి 10 గంటలకు వెళ్లవలసిందిగా గ్రామ సర్పంచ్ కామీశెట్టి ప్రశాంత్ కూలీలను ఈ సందర్భంగా కోరాడు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు ఆరెల్లి శ్రీదేవి. ఫీల్డ్ అసిస్టెంట్ జన్ను అఖిల్ ఉపాధి హామీ కూలీలు పాల్గొన్నారు.

# చోరీ కేసు చేదించిన పోలీసులు

## చోరీలకు పాల్పడిన ఇరువురి అరెస్టు, రిమాండ్




**పాలకుర్తి, మే 23(జనంసాక్షి)** మండలంలోని పలు గ్రామాల్లో చోటు చేసుకున్న చోరీ కేసును మండల పోలీసులు చేదించారు. శనివారం మండల కేంద్రంలోని పోలీస్టేషన్లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో చోరీ కేసు వివరాలను ఎస్సై పవన్ కుమార్ వెల్లడించారు. ఎస్సై దూలం పవన్ కుమార్ తెలిపిన వివరాల మేరకు.... మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురు మండలం మ నిగలవీడు గ్రామానికి చెందిన దాసరి మురళీకృష్ణ, దాసరి మురళిలు చోరీలకు పాల్పడుతూ జీవనం సాగిస్తున్నారు. వీరిపై పలు పోలీస్ స్టేషన్లలో కేసులు నమోదై పలు మార్లు జైలు జీవితం గడిపారు. గత ఏడాది మండలంలో శాతాపురం గ్రామంలో, గత నాలుగు నెలల క్రితం అయ్యంగారిపల్లి శివారు ఎల్లమ్మగడ్డ తండాలో జరిగిన చోరీలకు పాల్పడ్డారు. బాదితుల ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేపట్టిన పోలీసులు అనుమానితులను విచారించి నిందితులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.6. లక్షలు 25 వేలు విలువ చేసే మూడు తులాల బంగారం, 70 తులాల వెండి ఆభరణాలను, ఒక కారు, ఆటోను స్వాధీనం చేసుకొని రిమాండ్కు తరలించినట్లు ఎస్సై తెలిపారు. కేసును త్వరితగతిన చేదించిన పోలీసులను కమీషనర్ సన్ ప్రీత్ సింగ్. డీసీపీ రాజమహేంద్ర నాయక్ అభివనందించారు.

## కోయగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను పరిశీలించిన జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు



**ములుగు ప్రతినిధి,మే 23(జనంసాక్షి).** రామచంద్రపురం గ్రామపంచాయతీ కోయగూడెం లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు పరిశీలించారు. శనివారం ములుగు జిల్లా మల్లంపల్లి మండలం రామచంద్రాపురం గ్రామపంచాయతీ కోయగూడెం లోని జిల్లా పరిషత్ ఇంగ్లీష్ మీడియం ఉన్నత పాఠశాలను జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు పరిశీలించి పలు వివరాలపై ఆరా తీశారు. మల్లంపల్లి మండల కేంద్రంలోని సోషల్ వెల్ఫేర్ గురుకుల పాఠశాలను కోయగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు తరలించే ప్రతిపాదన దృష్ట్యా గురుకుల విద్యార్థులకు హాస్టల్ వసతి, అదనపు తరగతి గదుల కల్పన, ఇతర మౌలిక సదుపాయాలకు సంబంధించిన అంచనాలను సిద్ధం చేయాలని సంబంధిత శాఖ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోతు రవిచందర్, విద్యాశాఖ అధికారి సిద్ధార్థ రెడ్డి, సోషల్ వెల్ఫేర్ డిసిఓ వెంకటేశ్వర్లు, డిఈ రామకృష్ణ, స్థానిక ప్రజా ప్రతినిధులు, సంబంధిత శాఖ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## రేపు మురళి మెమోరియల్ క్రికెట్ అకాడమీ ప్రారంభం



**బెల్లంపల్లి మే 23, (జనంసాక్షి)** బెల్లంపల్లి పట్టణంలోని రైల్వే స్టేషన్ ప్రాంతంలో శ్రీ మురళీ మెమోరియల్ క్రికెటర్ అకాడమీ నూతన వేదికను బెల్లంపల్లి ఎమ్మెల్యే వినోద్ సోమవా రం రోజు ప్రారంభించనున్నారు. గత సంవత్సరం కాలం నుండి ఈ అకాడమీని బెల్లంపల్లి లో నిర్వహిస్తున్నారు. అయితే ప్రస్తుత స్థలం ఇరుకుగా ఉండడంతో నూతన స్థలాన్ని ఎంపిక చేసుకొని ఈ అకాడమీలో శిక్షణ పొందే క్రీడాకారులకు మంచి సౌకర్యాలను కల్పించడానికి నిర్వాహకులు నిర్ణయించారు. గతంలో నిర్వహించిన పాత స్థలంలో అనేకమంది క్రీడాకారులకు శిక్షణ ఇచ్చిన అకాడమీ వారు వివిధ ప్రాంతాలలో జరిగే టోర్నమెంట్లలో కూడా విద్యార్థులు పాల్గొని ప్రతిభ కనబరిచి ఈ ప్రాంతానికి పేరు తీసుకువచ్చేలా ప్రయత్నించారు. ప్రస్తుతం నూతనంగా ఏర్పాటు చేస్తున్న అకాడమీ వేదిక చాలా విశాలంగా ఉండడంతో క్రీడాకారులు మంచి శిక్షణ పొందడానికి అవకాశం ఏర్పడింది. ఈ వేదికను ఎమ్మెల్యే ప్రారంభించే సమయంలో పట్టణంలోని పలువురు ప్రముఖులు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొంటారని క్రికెట్ అకాడమీ నిర్వాహకులు అల్లం వెంకటేశ్వర్లు తెలిపారు.

## జొన్న కొనుగోలు కేంద్రం ప్రారంభం



**సారంగాపూర్,మే23(జనం సాక్షి)** మండల వ్యవసాయ మార్కెట్లో జొన్న కొనుగోలు కేంద్రాన్ని వ్యవసాయ మార్కెట్ చైర్మన్ అబ్దుల్ హాది మరియు కొట్ల పీఏసీఎస్ చైర్మన్ ఆయిర నారాయణ రెడ్డి సంయుక్తంగా ప్రారంభించారు. రాష్ట్ర ప్రభుత్వం క్వింటాల్‌కు 3699 రూపాయల మద్దతు ధర ప్రకటించింది.సారంగాపూర్ మండల వ్యవసాయ మార్కెట్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన జొన్న కొనుగోలు కేంద్రాన్ని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ అబ్దుల్ హాది, కొట్ల పీఏసీఎస్ చైర్మన్ ఆయిర నారాయణ రెడ్డి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం రైతుల సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇస్తుందని, అందులో భాగంగానే జొన్నకు మద్దతు ధరను నిర్ణయించిందని తెలిపారు.

# ఐటీడీఏలో ఉచిత వైద్య శిబిరం

### ఉద్యోగుల ఆరోగ్యంపై దృష్టి

### 63 మందికి స్క్రీనింగ్ పరీక్షలు

### ఏటూరు నాగారం



**మే 23 (జనం సాక్షి).** మండల కేంద్రంలో ని ఐటిడిఏ లో విధి నిర్వహణలో ప్రభుత్వ ఉద్యోగులు తీవ్ర ఒత్తిళ్లకు గురికావడం సహజ మని, తరచూ వైద్యపరీక్షలు నిర్వహించుకోవడం ద్వారా ఆరోగ్యాలను కాపాడుకోవచ్చని గుర్తించిన ప్రాజెక్ట్ అధికారి లెనిన్ వత్సల్ టోప్పో, ఈ రోజు శనివారం ఐటిడిఏ కార్యాలయం నందు ఉద్యోగస్తులకు, వారి కుటుంబ సభ్యులకు మరియు సందర్శకులకు ఆరోగ్య పరమైన అన్ని రకాల పరీక్షలు నిర్వహించే ఉచిత వైద్య శిబిరము కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమమును సమీకృత గిరిజనాభివృద్ధి సంస్థ (ఐ.టి.డి.ఏ.) ప్రాజెక్ట్ అధికారి లెనిన్ వత్సల్ టోప్పో ,ఐఏయస్ అసిస్టెంట్ ప్రాజెక్ట్ అధికారి నాగోరావు , దబ్బకట్ల జనార్ధన్, డిప్యూటీ డైరెక్టర్, ట్రైబల్ వెల్ఫేర్ మరియు జిల్లా ఉప వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా. కోరం క్రాంతి కుమార్, కలసి పర్యవేక్షణ చేశారు. ఆరోగ్యంగా ఉన్నపటికీ శరీరంలో ఎలాంటి రోగాలు ఉన్నాయో ముందుగా గుర్తించక పోవడంతో .. ఎంతగా నష్టపోయామో వైద్య పరీక్షలు చేయించుకుంటే కానీ తెలియదు. ప్రతి ఒక్క ఉద్యోగి తప్పనిసరిగా ఆరోగ్య పరమైన అన్ని పరీక్షలు చేయించుకోవాలని కోరడమైనది .ఆరోగ్య సమస్యలను ముందస్తుగా గుర్తించడంలో స్క్రీనింగ్ సహాయపడుతుందని మరియు ఆరోగ్య పరీక్షల ప్రయోజనాన్ని పొందేందుకు ఉద్యోగులందరినీ ప్రోత్సహించాలని మరియు వారి ఫిట్‌నెస్‌ను మెరుగుపరచడం ద్వారా పనితీరును మెరుగుపరచడంపై దృష్టి పెట్టాలని ఆయన అన్నారుసమీకృత గిరిజనాభివృద్ధి సంస్థ సిబ్బంది తో కలసి అసిస్టెంట్ ప్రాజెక్ట్ అధికారి నాగోరావు, వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఐ.టి.డి.ఏ. సమావేశ మందిరంలో (63) మంది ఉద్యోగులకు శనివారం జిల్లా ఉప వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా. కోరం క్రాంతి కుమార్, ఆధ్వర్యంలో స్క్రీనింగ్‌తో సహా పలు పరీక్షలు నిర్వహించబడ్డాయి. కార్యక్రమంలో నాగోరావు, అసిస్టెంట్ ప్రాజెక్ట్ అధికారి, దబ్బకట్ల జనార్ధన్ ,డిప్యూటీ డైరెక్టర్ ట్రైబల్ వెల్ఫేర్ , డా. కోరం క్రాంతి కుమార్, జిల్లా ఉప వైద్య ఆరోగ్య శాఖ అధికారి, రాజ్ కుమార్ ,స్టాటిస్టికల్ ఆఫీసర్, శ్రీనివాస్, ఐటిడిఏ. మేనేజర్ వైద్యులు గైనకాలజిస్ట డాక్టర్ అరవింద, పిల్లల వైద్యులు డాక్టర్ స్రవంతి, డాక్టర్ సుధీర్ రెడ్డి ,జనరల్ ఫిజీషియన్, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ప్రశాంత్, వాసం నరసింహారావు, సబ్ యూనిట్ ఆఫీసర్, ఆర్. మహేందర్, ఎన్ హెచ్ ఎం. ప్రోగ్రాం మేనేజర్, ఎం. స్వామి,ఫార్మసీ ఆఫీసర్, విజయ్ కుమార్, ఫార్మసీ ఆఫీసర్, అప్తాల్మిక్, వైకుంటం, ల్యాబ్ టెక్నిషన్స్ శ్రీనివాస్,భాగ్యమ్మ హెల్త్ అసిస్టెంట్ ఫిమేల్, ఆశ కార్యకర్తలు స్వరూప, విజయ, సరిత, అరుణ ఓ శారద ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## ములుగు జిల్లాలో అంగన్‌వాడీ టీచర్, ఆయా పోస్టుల భర్తీకి త్వరలో నోటిఫికేషన్

### డి డబ్ల్యుఓ ప్రేమలత



**ములుగు ప్రతినిధి,మే 23(జనంసాక్షి).** మహిళా శిశు సంక్షేమ శాఖలోని ఐసీడిఎస్ పథకంలో ములుగు జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ టీచర్, ఆయా పోస్టులను భర్తీ చేయడానికి త్వరలోనే నోటిఫికేషన్ వెల్లడిస్తామని శనివారం జిల్లా సంక్షేమ అధికారిణి ప్రేమలత ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా సంక్షేమ అధికారిణి మాట్లాడుతూ రాష్ట్ర పంచాయ తీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క ఆదేశాల మేరకు, కమిషనరేట్ నుండి అందిన ఆదేశాల ప్రకారం ఈనియామకాలను చేపట్టనున్నట్లు తెలిపారు. జిల్లా కలెక్టర్ అనుమతితో త్వరలో నోటిఫికేషన్ జారీ చేస్తామని జిల్లా సంక్షేమ అధికారిణి తెలిపారు. అర్హతలు:1. లివయస్సు:లి 18 నుండి 35 సంవత్సరాల మధ్య ఉండాలి. 2. లివిద్యార్హత:లి ఇంటర్మీడియట్ పాసై ఉండాలి. 3. లినివాసం: షెడ్యూల్డ్ ఏరియా (గా) అయితే గ్రామ పరిధిలో నివాసి అయి ఉండాలి. నాన్ షెడ్యూల్డ్ ఏరియా అయితే గ్రామ పంచాయితీ పరిధిలో నివాసి అయి ఉండాలి– మున్సిపాలిటీ ఏరియా అయితే సంబంధిత వార్డు నివాసి అయి ఉండాలి. అంగన్‌వాడీ హెల్పర్లకు:లి ఖాళీగా ఉన్న చోట ఇంటర్మీడియట్ చదివిన అంగన్‌వాడీ హెల్పర్లు లేనట్లయితే పదవ తరగతి పాసైన వారికి అవకాశం కల్పించబడును. దరఖాస్తు విధానం నోటిఫికేషన్ విడుదలైన తర్వాత అధికారిక వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. కావాల్సిన సర్టిఫికెట్లుకులం, నివాసం, విద్యార్హతల సర్టిఫికెట్లు సిద్ధంగా ఉంచుకోవాలి. వితంతువులు, దివ్యాంగులైన మహిళలు సంబంధిత ధ్రువ పత్రాలతో దరఖాస్తు చేసుకుంటే వెయిటేజీ ఇవ్వబడును. అర్హులైన మహిళలు త్వరలో రానున్న నోటిఫికేషన్‌ను గమనించి దరఖాస్తు చేసుకోవాలని జిల్లా సంక్షేమ అధికారిణి ఆ ప్రకటనలో కోరారు.

## ఇంటర్మీడియట్ గ్రూపులో ప్రవేశాలు మొదలయ్యాయి

### ఎంపీడీవో సిహెచ్ వరుణ్ కుమార్



**–గోవిందరావుపేట. మే.( జనం సాక్షి).. 23.05.2** తెలంగాణ మోడల్ స్కూల్ చల్వాయి లో (లక్నవరం క్రాస్ రోడ్ దగ్గర హైవే మీద ఉన్నది). ఇంటర్మీడియట్ గ్రూపులలో ప్రవేశాలు మొదలయ్యాయి అని ఎంపీడీవో సిహెచ్ వరుణ్ కుమార్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో మీడియాతో ఎంపీడీవో వరుణ్ కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పాటు చేసిన అద్భుతమైన ఇంగ్లీష్ మీడియం లో ఇంటర్మీడియట్ తోపాటు ఎఫ్ సెట్,నీట్,ఐ ఐ టి కోచింగ్ తో పాటు అద్భుతమైన బోధన ఇక్కడ చేయబడుతుంది అన్నారు. గర్ల్స్ కి హాస్టల్ లో సదుపాయం కలదు. కావున మీకు తెలిసిన లేదా మధ్యతరగతి తల్లిదండ్రులు లేని పిల్లలకు ప్రైవేటులో ఎక్కువగా డబ్బులు ఖర్చు పెట్టలేని తల్లిదండ్రులకు ఈ విషయాన్ని మీకు సంబంధించిన వారికి తెలియజేయాలని ఎంపీడీవో. అన్నారు. భవిష్యత్తులో మంచిగా వృద్ధి చెందేందుకు భావితరాల పిల్లలను ఆశీర్వదించండి. ఇంటర్మీడియట్ డే స్కాలర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం కూడా ఉంటుంది. 6 తరగతి నుండి 10వ తరగతి విద్యార్థులకు కూడా అడ్మిషన్స్ కలవు మరియు హాస్టల్ వసతి కూడా కలదు వారు కూడా నేరుగా సంప్రదించి చేరవచ్చు అని అన్నారు. ఇంకా పూర్తి వివరాలు కావాలనుకుంటే మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ కుమార్ యొక్క నంబర్ కి 8096350115 సంప్రదించగలరని తెలిపారు.

## కాంగ్రెస్ ఎస్సీ శాఖ జిల్లా చైర్మన్‌గా చేపూరి వినోద్

**స్టేషన్ ఘన్పూర్, మే 23 ( జనం సాక్షి) :** తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఎస్సీ శాఖ జన గామ జిల్లా చైర్మన్ గా స్టేషన్ ఘన్పూర్ మున్సిపా లిటీ పరిధిలోని చాగల్లు కు చెందిన కాంగ్రెస్ సీని యర్ నాయకుడు చేపూర్ వినోద్ ను నియమించ దం జరిగిం దని తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ)ఎస్సీశాఖ రాష్ట్ర చైర్మన్, మానకొం దూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ ఒక ప్రకటన లో తెలిపారు. ఈ సందర్భ ంగా జనగామ జిల్లా ఎస్సీ సెల్ చైర్మన్ నూతనంగా ఎన్ని కైన చేపూరి వినోద్ మాట్లా డుతూ ఎస్సీల సమస్యలు ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి, తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ)ఎస్సీ శాఖరాష్ట్ర చైర్మన్,మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణకు, స్థానిక ఎమ్మెల్యే కడియం శ్రీహరి కి, ఎంపీ డాక్టర్ కడియం కావ్య కు తదితర నాయకులకు కృతజ్ఞతలు తెలి పారు.

# 36 రోజులుగా అంబలి పంపిణీ..



**దాహార్తి తీర్చుతున్న సేవా కార్యక్రమం**

**రెబ్బెన, మే23 (జనం సాక్షి):** మండే ఎండల్లో ప్రజలకు చల్లదనాన్ని అందిస్తూ రెబ్బెన మండల కేంద్రంలోని బస్ స్టాప్‌తో పాటు ఇందిరానగర్ గ్రామంలో గత 36 రోజులుగా నిరంతరంగా అంబలి పంపిణీ కార్యక్రమం కొనసాగుతోంది. అమ్మవారి ఆశీస్సులతో దేవార వినోద్ స్వామి, వారి కుటుంబ సభ్యులు కలిసి ఈ సేవా కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. ప్రతి రోజు ఉదయం నుంచే అంబలి తయారీ పనులు ప్రారంభించి, మధ్యాహ్న సమయానికి ప్రయాణికులు, కూలీలు, గ్రామస్తులు, ఆటో డ్రైవర్లు, అనారోగ్యంతో బాధపడుతున్న వారికి ప్రేమతో పంపిణీ చేస్తున్నారు. తీవ్ర వేసవి కారణంగా ప్రజలు ఎండ తాపానికి ఇబ్బందులు పడుతున్న సమయంలో చల్లని అంబలి అందించడం ద్వారా దాహార్తిని తీర్చడమే కాకుండా శరీరానికి ఉపశమనం కలిగిస్తున్నారని పలువురు పేర్కొంటున్నారు. ముఖ్యంగా ఉపాధి పనులకు వెళ్లే కూలీలు, దూర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు ఈ అంబలి సేవతో ఎంతో ఉపకారం పొందుతున్నామని తెలిపారు.

# అక్రమంగా తరలిస్తున్న కలప పట్టివేత



**బోథ్, మే 23 (జనంసాక్షి) :** మండలంలోని పిప్పదారి గ్రామ శివారులో అక్రమంగా మూడు దుంగ లను ఎడ్ల బండి పై తరలిస్తుండగా పట్టుకున్నట్లు ఇంచార్జి అటవీ క్షేత్రాధికారి కవిత తెలిపారు. పట్టుబడిన ఇద్దరు వ్యక్తులను పట్టుకొని కేసు నమోదు చేసి కలప స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. సెక్షన్ అధికారి నగరావు, బీట్ అధికారులు సంధ్య,అనిల్ తదితరులు ఉన్నారు.

# దొంగతనం కేసులో పట్టుబడ్డ బంగారం ఏమైనట్టు!

అప్పగించి అనంతరం బాధితురాలికి పోగొట్టుకున్న 12 తులాల బంగారాన్ని అప్పగించాల్సి ఉంది. అదేవిధంగా దొంగతనం చేసిన నిందితుడిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాల్సి ఉంది. కానీ ఇప్పటివరకు ఆ బంగారాన్ని అప్పగించకుండా అటు బాధితురాలు, ఇటు నిందితుడి వద్ద రూ. 1 లక్ష 40 వేలకు భేరసారాల కింద సెటిల్మెంట్ చేసుకొని కేసును నీరుగారుస్తూ చట్టాన్ని బేఖాతర్ చేస్తున్నారని పోలీసుల పనితీరు పట్ల పలువురు అసహనం వ్యక్తం చేస్తున్నారు. సోదరీ సోదరుడు దొంగతనం కేసు విషయంలో కాంప్రమైజ్ అయ్యారని 12 తులాల బంగారం రికవరీ చేసి అప్పగిస్తున్నందుకు బాధితురాలి వద్ద రూ 70 వేలు, దొంగతనం కేసు లేకుండా చూసుకుంటామని నిందితుడి వద్ద రూ. 70 వేలకు డీల్ కుదుర్చుకున్నట్లు గ్రామంలో ప్రచారం జోరుగా కొనసాగుతుంది. ఏది ఏమైనా బంగారం కథ పోలీస్ స్టేషన్ కు కూతవేటు దూరంలో ఉన్న గ్రామంలో చర్చనీయాంశంగా మారింది. అంతేకాక ఈ బంగారం కథ పోలీసు పెద్ద సారు దృష్టికి కూడా వెళ్లిందనే చర్చ జోరుగా నడుస్తోంది. ఇప్పటికైనా పోలీసు ఉన్నతాధికారులు పూర్తిస్థాయిలో విచారణ జరిపి చోరీకి గురైన 12 తులాల బంగారాన్ని కోర్టు ద్వారా బాధితురాలికి అప్పగించి నిందితుడిపై శాఖ పరమైన చర్యలు తీసుకొని పోలీసు శాఖ అభాసు పాలు కాకుండా బాధితురాలికి న్యాయం చేయాలని గ్రామస్తులు, పలువురు కోరుతున్నారు.



# కూలీలకు మజ్జిగ ప్యాకెట్ల పంపిణీ

**పాలకుర్తి, మే 23(జనంసాక్షి)** మండలంలోని ఈరవెన్ను గ్రామంలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాది హామీ పథకంలో పని చేస్తున్న కూలీలకు ఎండ వేడిమిని తట్టుకునేందుకు గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచు కుమారస్వామి మాట్లాడుతూ కూలీలు ఎండ వేడిలో ఉపశమనం పొందేందుకు గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచు అశోక్, పంచాయతీ కార్యదర్శి రాజేష్, ఫీల్డ్ అసిస్టెంట్ సరిత తదితరులు పాల్గొన్నారు.

# సోలార్ విద్యుత్ ఒక అద్భుతం

**సోలార్ ద్వారానే పర్యావరణ పరిరక్షణ కు మేలు**
**ప్రభుత్వ సబ్సిడీ తో పాటు ఇంకా ఎన్నో ప్రయోజనాలు : రైస్ మిల్లర్ అసోసియేషన్ అధ్యక్షుడు బాదం ప్రవీణ్**



**ములుగు,మే23(జనం సాక్షి):** ములుగు జిల్లా కేంద్రం లోని రైస్ మిల్లర్ల అసోసియేషన్ ఆఫీసు లో ఏర్పాటు చేసిన పీఎం సూర్య ఘర్ ముఫ్త్ బిజిలీ యోజన పథకం పై అవగాహన సదస్సు ను ఏర్పాటు చేయడం జరిగింది. ఇందులో భాగం గా సోలార్ కంపెనీ కి సంబంధించిన మేనేజర్ మరియు జిల్లా రైస్ మిల్లర్ల అసోసియేషన్ అధ్యక్షుడు బాదం ప్రవీణ్ మరియు జిల్లా వర్తకపు అధ్యక్షులు సిరికొండ బలరాం మరియు రైస్ మిల్లర్ల సభ్యులు కొమురవెల్లి హరినాథ్,బాదం అరుణ్ కుమార్ ఇతర సభ్యులు, తదితరులు పాల్గొన్నారు. ఇందులో భాగం గా దీనికి సంబంధించిన మేనేజర్ మాట్లాడుతూ భారత ప్రభుత్వం ప్రవేశపెట్టిన పీఎం సూర్య ఘర్ ముఫ్త్ బిజిలీ యోజన పథకం దేశవ్యాప్తంగా మధ్యతరగతి,తక్కువ ఆదాయ కుటుంబాల్లో భారీ ఆసక్తిని రేకెత్తిస్తోంది. ఈ పథకం కింద ఇంటి పైకప్పుపై రూఫ్‌టాప్ సోలార్ వ్యవస్థలు ఏర్పాటు చేసుకునే వారికి కేంద్రం భారీ సబ్సిడీ అందిస్తోందనీ. ప్రతి నెలా 300 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్‌ను అందించడం ఈ పథక ముఖ్య లక్ష్యమని. 2024 జనవరి 22న ఈ పథకాన్ని ప్రకటించారు. దీని ద్వారా దేశవ్యాప్తంగా సుమారు కోటి కుటుంబాలకు రూఫ్‌టాప్ సోలార్ వ్యవస్థలు అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోంది.

ప్రస్తుతం భారతదేశంలో రూఫ్‌టాప్ సోలార్ వ్యవస్థల ఖర్చు ప్రతి కిలోవాట్‌కు సుమారు రూ. 60,000 నుంచి రూ. 80,000 మధ్య ఉంటోంది. అంటే 3 కిలోవాట్ల సోలార్ సిస్టమ్ ఏర్పాటు చేయాలంటే సుమారు రూ. 1.8 లక్షల వరకు ఖర్చవుతుంది. అయితే కేంద్ర సబ్సిడీ రూ. 78,000 తీసివేస్తే, వినియోగదారుడు స్వయంగా భరించాల్సిన మొత్తం సుమారు రూ. 1.08 లక్షలకు తగ్గుతుంది. కొన్ని రాష్ట్రాల్లో అదనపు రాష్ట్ర సబ్సిడీలు కూడా లభిస్తున్నాయి. ఉదాహరణకు ఉత్తర్‌ప్రదేశ్‌లో అదనంగా రూ. 30,000 వరకు రాష్ట్ర సబ్సిడీ అందిస్తున్నారు.

# 25 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

- **చెన్నారావుపేట పోలీస్ స్టేషన్ లో అప్పగించిన టాస్క్ ఫోర్స్ పోలీసులు...**




**చెన్నారావుపేట, మే 23 (జనంసాక్షి) :** 25 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని టాస్క్ ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. గురిజాల గ్రామానికి చెందిన గోలి రవీందర్ తన అశోక్ లేలాండ్ ట్రాలీ వాహనంలో రేషన్ బియ్యాన్ని నిల్వ ఉంచినట్లు సమాచారం అందడంతో టాస్క్ ఫోర్స్ పోలీసులు దాడి నిర్వహించారు. సుమారు రూ. 87 వేల 500 విలువైన 60 బస్తాల రేషన్ బియ్యం స్వాధీనం చేసుకొని వాహనంతో సహా నిందితుడిని పట్టుకొని పోలీసులకు అప్పగించారు.

# అర్హులు ఆసరా పెన్షన్స్ దరఖాస్తు చేసుకోవాలి

- **మండల వర్కింగ్ ప్రెసిడెంట్ చెట్టుపల్లి వెంకటేశ్వర్లు**



**వంగపేట మే 23(జనం సాక్షి) :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం జూన్ 02వ తేదీన రెండు లక్షల నూతన ఆసరా పెన్షన్స్ ప్రారంభించనుంది అని కాంగ్రెస్ పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ చెట్టుపల్లి వెంకటేశ్వర్లు శనివారం ఒక ప్రకటనలో అన్నారు. నూతన పెన్షన్ లను రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ మంత్రి ధనసరి సీతక్క తో లాంఛనంగా ప్రారంభించనున్నారు. గతంలో ప్రజా పాలన దరఖాస్తు చేసుకొనేవారు తమ తమ గ్రామపంచాయతీ పరిధిలో గ్రామ కార్యదర్శులకు అర్హులు దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు. ఆసరా పెన్షన్లలో వృద్ధాప్య, వితంతు మహిళ, వికలాంగులు, ఒంటరి మహిళలు, దీర్ఘకాలిక వ్యాధులు గల అర్హులు దరఖాస్తు చేసుకోవాలని వెంకటేశ్వర్లు కోరారు.

# యువత అభివృద్ధే ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక లక్ష్యం

**ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి**
**యువజన, క్రీడల వారోత్సవాల్లో విజేతలకు మెడల్స్ ప్రదానం**




హనుమకొండ ప్రతినిధి మే 23 (జనం సాక్షి) :యువత అభివృద్ధే ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక లక్ష్యమని ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్న యువజన, క్రీడల వారోత్సవాల్లో శనివారం హనుమకొండ యువజన, క్రీడల శాఖ ఆధ్వర్యంలో "ఉద్యోగ సాధన – – కనెక్టింగ్ టాలెంట్ విత్ అపార్చునిటీస్" కార్యక్రమం నిర్వహించి విజేతలకు మెడల్స్ అందజేశారు. హనుమకొండ జిల్లా యువజన, క్రీడా అభివృద్ధి అధికారి కొత్త ప్రశాంత్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ యువతలో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసి సరైన దిశలో ప్రోత్సహించడమే యువజన, క్రీడల శాఖ ప్రధాన లక్ష్యమని తెలిపారు. ప్రజా పాలన –– ప్రగతి ప్రణాళిక కార్యక్రమాల ద్వారా యువతకు క్రీడలు, ఉపాధి, వ్యక్తిత్వ వికాసానికి సంబంధించిన అనేక అవకాశాలు కల్పిస్తున్నామని పేర్కొన్నారు. క్రీడలు యువతలో క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తాయని తెలిపారు. జిల్లాలో నిర్వహిస్తున్న యువజన, క్రీడల కార్యక్రమాలకు విశేష స్పందన లభిస్తోందని చెప్పారు. ఈ కార్యక్రమానికి వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రజా పాలన –– ప్రగతి ప్రణాళిక కార్యక్రమం ద్వారా ప్రభుత్వం ప్రజలకు మరింత చేరువవుతోందని అన్నారు. యువత అభివృద్ధి, ఉపాధి అవకాశాల కల్పన, క్రీడలకు ప్రోత్సాహం వంటి అంశాలకు ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. యువత తమ ప్రతిభను వెలికితీసుకుని సమాజ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని సూచించారు. క్రీడలు యువతలో నాయకత్వ లక్షణాలు, క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తాయని పేర్కొన్నారు. కుడా చైర్మన్ ఇనుగాల వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ యువతలో సామాజిక బాధ్యత పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయని అన్నారు. క్రీడలు యువతను మంచి మార్గంలో నడిపించి సమాజానికి ఉపయోగపడే వ్యక్తులుగా తీర్చిదిద్దుతాయని తెలిపారు. ఉమ్మడి జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎండి అజీజ్ ఖాన్ మాట్లాడుతూ గ్రామీణ స్థాయి నుంచి క్రీడాకారులను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. యువత క్రీడలను కెరీర్‌గా మలుచుకునేలా ప్రభుత్వం, క్రీడా సంఘాలు కలిసి పనిచేస్తున్నాయని తెలిపారు.

# రిపోర్టర్ శివ రామకృష్ణ ను పరామర్శించిన టియుడబ్ల్యుజె ప్రతినిధులు



**నిర్మల్ బ్యూరో, మే 23 (జనంసాక్షి) :** రమేష్ రెడ్డి మల్టీ స్పెషలిస్ట్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న రిపోర్టర్ శివ రామకృష్ణ ను శనివారం తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (ఐజేయు) నాయకులు పరామర్శించారు. హాస్పిటల్‌కు వెళ్లిన యూనియన్ ప్రతినిధులు ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఆయనకు అందుతున్న వైద్య సేవలను వైద్యులతో మాట్లాడి తెలుసుకుంటూ, త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్షుడు కొండూరు రవీందర్, జిల్లా ప్రధాన కార్యదర్శి వెంక గారి భూమయ్య, సోషల్ మీడియా జిల్లా కన్వీనర్ యోగేష్, జిల్లా ఉపాధ్యక్షులు గుమ్మల అశోక్, సంయుక్త కార్యదర్శి సట్ల హనుమన్లు పాల్గొన్నారు. వీరితో పాటు జిల్లా కమిటీ సభ్యులు రవికుమార్, సాయిరాజ్ గౌడ్, గంగాధర్, గంగారం తదితరులు శివ రామరాజును పరామర్శించి ధైర్యం చెప్పారు.